# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 28-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 224 పేజీలు:6 వెల: రూ.1/-


## లడాఖ్‌లోని లేహ్‌లో భారీగా కురిసిన హిమపాతం

**-అక్కడ వందల సంఖ్యలో చిక్కుకుపోయిన టూరిస్టులు**

లడాఖ్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: లడాఖ్‌లోని లేహ్‌లో భారీగా హిమపాతం కురిసింది. దీంతో అక్కడ వందల సంఖ్యలో టూరిస్టులు చిక్కుకుపోయారు. లేహ్‌లోని చాంగ్లా యాక్సిస్ వద్ద చిక్కుకున్న పర్యాటకుల్ని భద్రతా దళాలు రక్షించాయి. శుక్రవారం సాయంత్రం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. భారీ సంఖ్యలో టూరిస్టులు రావడంతో ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. లడాఖ్ పోలీసు శాఖకు చెందిన రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. ఆర్మీ, గ్రీఫ్ రెస్క్యూ బృందాలు కూడా యాక్టివ్‌గా ఉన్నాయి. అన్ని దళాలు ఒక్కటిగా పనిచేయడంతో.. చాంగ్లా యాక్సిస్ వద్ద ఉన్న పర్యాటకుల్ని లేహ్‌కు సురక్షితంగా తరలించారు. గత రెండు రోజుల నుంచి భీకరంగా మంచు కురుస్తోంది. దీంతో అక్కడ పర్యాటకుల పరిస్థితి దయనీయంగా మారింది. మంచుగడ్డలు పేరుకుపోవడంతో జారిపడుతున్నారు. రోడ్లు కూడా స్లిప్పరీగా మారాయి. చాంగ్లా టాప్ వద్ద అనేక వాహనాలు నిలిచిపోయాయి. ట్యాక్సీలు, ప్రైవేటు కార్లు కదలలేని స్థితిలో ఉండిపోయాయి. వెదర్‌ను దృష్టిలో పెట్టుకుని పర్యాటకుల తమ టూర్‌ను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కేంద్రం ఆగడాలు మితిమీరిపోతున్నాయి.. ఢిల్లీ ఆర్డినెన్స్‌పై ధ్వజమెత్తిన సీఎం కేసీఆర్




హైదరాబాద్, మే27:కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రం ఆగడాలు, అరాచకాలు మితిమీరిపోతున్నాయని కేసీఆర్ మండిపడ్డారు. ప్రగతి భవన్‌లో ఢిల్లీ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్‌తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ మీడియాతో మాట్లాడారు.

దేశంలో కేంద్ర ప్రభుత్వం అరాచకాలు, ఆగడాలు.. మితిమీరిపోయాయి. కారణం ఏంటంటే.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతూ, పని చేయనీయడం లేదు అని కేసీఆర్ పేర్కొన్నార.

చాలా రాష్ట్రాల్లో చాలా సందర్భాల్లో నాన్ బీజేపీ ప్రభుత్వాల వెంబడి పడుతున్నాయి. రకరకాల దాడులు చేస్తూ బెదిరిస్తున్నారు. అనేక దుర్మార్గాలకు పాల్పడుతోంది కేంద్రం. ఇటీవలి కాలంలో ఢిల్లీలో రెండు వింత సంఘటనలు చూశారు. ఆప్ చాలా పాపులర్ పార్టీ. ఇది దేశానికి, ప్రపంచానికి తెలుసు. కేజ్రీవాల్ నాయకత్వంలో సామాజిక ఉద్యమం ద్వారా వచ్చిన పార్టీ.

ఒక్కసారి, రెండు సార్లు కాదు.. మూడు సార్లు అద్భుతమైన విజయం సాధించింది. ఈ మధ్యకాంలో వింత సంఘటన చూశాం. ఢిల్లీలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. స్పష్టమైన ఆధిక్యంతో ఆప్ విజయం సాధించింది.

కానీ బీజేపీ ఎన్నో రకాలుగా, కుయుక్తులు చేసినా ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. మేయర్‌ను ప్రమాణస్వీకారం చేసేందుకు ముప్పుతిప్పలు పెట్టారు. సుప్రీంకోర్టు ఆర్డర్ తర్వాత ప్రమాణం చేయాల్సి వచ్చింది. కేజ్రీవాల్ మూడుసార్లు కూడా రెండు జాతీయ పార్టీలను మట్టికరిపించి బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచారు అని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు.

ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్‌ను తెచ్చి ఊపిరాడకుండా, అనేక దుర్మార్గ చర్యలకు పాల్పడుతుంది. కేజ్రీవాల్ గవర్నమెంట్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే ఐదు సభ్యులతో కూడిన బెంచ్ స్పష్టమైన ఆదేశం ఇచ్చింది. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం కిందనే అధికారులందరూ పని చేయాల్సి ఉంటుంది. కచ్చితంగా ప్రభుత్వం చెప్పినట్లు వినాలి. గవర్నర్ల చేతుల్లో ఉండరాదు అని కోర్టు చెప్పింది. సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను కూడా కాలరాశారు. సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరిస్తూ ఇవాళ భయంకరంగా ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు వస్తున్నాయి.

ఎమర్జెన్సీని వ్యతిరేకించే బీజేపీ నేతలు కూడా ఇప్పుడు అదే చేస్తున్నారు. ఇందిరా గాంధీ అమలు చేసిన ఎమర్జెన్సీ దిశగా కేంద్రంలోని బీజేపీ వెళ్తోంది. బీజేపీకి ఢిల్లీ ప్రజలు మరోసారి తగిన బుద్ధి చెబుతారు. కేంద్ర ప్రభుత్వం ఒక రకంగా ఢిల్లీ ప్రజలను అవమానిస్తోందని కేసీఆర్ మండిపడ్డారు.

## బీజేపీ సర్కార్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోంది

**– దేశంలో ప్రస్తుతం ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయి**

**–'ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది.**

**–గవర్నర్ వ్యవస్థను ప్రస్తావించి మరీ కేంద్రంపై కేసీఆర్ ఫైర్..**

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);భారతదేశంలో ప్రస్తుతం ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యాఖ్యానించారు. శనివారం నాడు కేసీఆర్‌తో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్‌ల భేటీ ముగిసింది. కేంద్రం వ్యవహరిస్తున్న తీరు, కేంద్రం ఆర్డినెన్స్‌పై ముగ్గురు ముఖ్యమంత్రులు నిశితంగా చర్చించారు. అనంతరం ముగ్గురూ కలిసి ప్రగతిభవన్ వేదికగా జాయింట్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. మొదట సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. కర్ణాటకలో కర్రుకాల్చి వాతపెట్టినా కేంద్రం మారకపోతే ఎలా.. అని ప్రశ్నించారు. దేశాన్ని ఎటు తీసుకెళు న్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కేంద్రం అరాచకాలు, ఆగడాలు మితిమీరాయని కన్నెర్రజేశారు. బేజేపీయేతర ప్రభుత్వాలను కేంద్రం ఇబ్బంది పెడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ' ఏందీ గవర్నర్ వ్యవస్థ. గవర్నర్ పదవి అలంకారప్రాయమైన పదవి. బడ్జెట్ పాస్ కానివ్వనని గవర్నర్ అంటే ఎలా... సుప్రీంకోర్టుకు వెళ్లి బడ్జెట్ పెట్టుకోవాల్సిన దుస్థితి. ఇంత ధౌర్భాగ్య పరిస్థితి ఎక్కడైనా ఉంటదా..' అని కేంద్రంపై కేసీఆర్ కన్నెర్ర జేశారు.

### సుప్రీంకోర్టును ధిక్కరిస్తూ కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది

'సామాజిక ఉద్యమం ద్వారా వచ్చిన ఆప్, మూడుసార్లు అధికారంలోకి వచ్చింది. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ స్పష్టమైన మెజార్టీతో గెలిచింది. అయినా మేయర్ ప్రమాణస్వీకారం చేయడానికి ముప్పుతిప్పలు పెట్టారు. చివరికి సుప్రీంకోర్టుకు వెళ్లి మేయర్ ఎన్నిక నిర్వహించుకోవాల్సి వచ్చింది. అధికారుల బదిలీలన్నీ ఢిల్లీ ప్రభుత్వ హయాంలోనే జరగాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టును ధిక్కరిస్తూ కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది. లెఫ్టినెంట్ గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని కేంద్రం ముప్పుతిప్పలు పెడుతోంది. కేంద్రం తెచ్చిన ఈ ఆర్డినెన్స్‌ను పార్లమెంట్ వేదికగా వ్యతిరేకిస్తాం. ఆర్డినెన్స్‌ను ప్రధాని వెనక్కి తీసుకోవాలి. ప్రజలు మోదీ సర్కార్‌కు గట్టిగా బుద్ధి చెబుతారు. కర్ణాటక ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారు. కేంద్రం తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదం. కేంద్రం తీరు ఢిల్లీ ప్రజలను అవమానించేలా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవాలి. గవర్నర్ వ్యవస్థను కూడా కేంద్రం దుర్వినియోగం చేస్తోంది. అయినా సుప్రీం తీర్పును అమలు చేయకపోవడమేంటి.. మీకై మీరే ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోండి.. ఇది మీకు, దేశానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఎమర్జెన్సీ కంటే దారుణమైన పరిస్థితి కనిపిస్తోంది. అండమాన్ పాలనకు ఢిల్లీ పాలనకు చాలా తేడా ఉంది, సుప్రీం తీర్పును కేంద్రం గౌరవించకపోతే దేశం పరిస్థితేంటి..' అని కేంద్రంపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్రం ఆర్డినెన్స్ తెచ్చింది. బీజేపీ సర్కార్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోంది. ఢిల్లీ ప్రభుత్వానికి అధికారాలు లేకుండా చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా కేంద్రం లెక్కచేయడం లేదు. ప్రజాస్వామ్య రక్షణ కోసం అన్ని పార్టీలు ఏకం కావాలి' అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. మరోవైపు భగవంత్ సింగ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకే అధికారాలు ఉండాలని డిమాండ్ చేశారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. గవర్నర్ వ్యవస్థను మోదీ సర్కార్ దుర్వినియోగం చేస్తోంది. బీజేపీయేతర ప్రభుత్వాలను వేధించేందుకు గవర్నర్‌లను వాడుకుంటున్నారు' అని కేంద్రం తీరుపై భగవంత్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నాన్ బీజేపీ పార్టీలు ఒక్కటి కావాలి : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్




హైదరాబాద్, మే27: ఢిల్లీ పరిపాలనను అడ్డుకుంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను సీఎం అరవింద్ కేజ్రీవాల్ తప్పుపట్టారు. ఇది ఢిల్లీ సమస్య కాదు.. ఇది ప్రజల సమస్య అని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇవాళ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన తర్వాత నిర్వహించిన ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీకి సహకారం అందించిన తెలంగాణ సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ ప్రజల తరపున తాను ధన్యవాదలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. 2015, ఫిబ్రవరిలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. మేలో మోదీ సర్కార్ ఓ నోటిఫికేషన్ తెచ్చి తమ ప్రభుత్వాన్ని కూల్చార న్నారు. సర్వీస్ సంబంధిత విషయాల్లో గతంలో షీలా దీక్షిత్ వద్ద కంట్రోల్ ఉండేదన్నారు. తాము 8 ఏళ్లు పోరాటం చేశామని, మే 11వ తేదీన ఢిల్లీ ప్రజల తరపున అనుకూల తీర్పు వచ్చిందని, కానీ 8 రోజుల్లో వ్యతిరేక ఆర్డినెన్స్ తీసుకువచ్చిన ఢిల్లీ అధికారాల్ని మోదీ సర్కార్ లాగేసుకున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కన పెట్టేసి? ఆర్డినెన్స్ తేవడం అంటే న్యాయం కోసం ప్రజలు ఎక్కడికి వెళ్తారని ఆయన అడిగారు. ఢిల్లీ ప్రజలను ఇది అవమానించడమే అన్నారు. ఇది ఢిల్లీ ప్రజల సమస్య కాదు, ఇది దేశ ప్రజల సమస్య అన్నారు. సీబీఐ, ఈడీలతో బెదిరిస్తూ.. ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారని బీజేపీపై కేజ్రీ ఆరోపణలు చేశారు. నాన్ బీజేపీ సర్కార్లను కూల్చివేయడం బీజేపీకి అలవాటు అయ్యిందన్నారు. దేశవ్యాప్తంగా తాను ప్రజల తరపున తిరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ గవర్నరే పాలన చేయాలనుకుంటే, అప్పుడు ముఖ్యమంత్రిని ఎన్నుకోవాల్సి అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. నాన్ బీజేపీ పార్టీలు అన్ని ఒక్కటి అయితేనే బీజేపీ ఢీకొట్టగలమన్నారు. దేశ ప్రజల్లో విశ్వాసం నింపాలన్నారు. ఆజాదీని రక్షించుకోవాలంటే మోదీని ఓడించాలని కేజ్రీ పిలుపునిచ్చారు.

దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తాము పోరాటం చేస్తున్నట్లు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ సింగ్ తెలిపారు. నీతి ఆయోగ్ మీటింగ్ ఇవాళ ఢిల్లీలో జరుగుతోందని, కానీ అక్కడ చేసేది ఏమీలేదని, అందుకే తాము ఆ మీటింగ్‌ను బహిష్కరించినట్లు ఆయన చెప్పారు. మీటింగ్‌లను తమకు నచ్చినట్లే నిర్వహిస్తున్నారని భగవంత్‌మాన్ విమర్శించారు.

## అమరవీరుల స్మారక స్థూపం కోసం స్థలాన్ని పరిశీలించిన..మంత్రి సబితా



హైదరాబాద్, మే27: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో అమరవీరుల స్మారక స్థూపం నిర్మించడం కోసం తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్థలాన్ని పరిశీలించారు.. వికారాబాద్ నుండి తాండూర్ వెళ్లే మార్గంలో ఆర్‌ఎంపి అతిథి గృహం సమీపంలో ఈ స్థలాన్ని ఆమె స్థానికే ఎమ్మెల్యే ఆనంద్ చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య.. పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి.. కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద పటేల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్పీ కోటిరెడ్డి తో కలిసి ఆమె స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఈ విషయమై సంబంధిత అధికారులు తమకు నివేదిక సమర్పించాలని ఉద్యమాల గడ్డ ఐన తెలంగాణకు సంబంధించి వికారాబాద్ లో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా స్మారకస్థూపం ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. త్వరలో ఈ ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆమె అధికారులు ఆదేశించారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, మాజీ వైస్ చైర్మన్ చిగులపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' అందరికి వర్తింపజేయాలి



హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సైన్యం లో ప్రవేశ పెట్టిన 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్ ' 2టేబుల్ ను రక్షామంత్రాలయం 20.1.2023.లోజారీ చేశారు. అందులో సిపాయి,నాయక్,హవల్దార్ స్థాయి రాంకులకు మిలిటరీ సర్వీస్ పే అధికారులకు చాలావ్యత్యాసం వున్నది. వారికి పెంచిన విధంగా ఇతర రాంకులకు అదే పెరుగుదల వర్తింప చేయాలని ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వుజ్జని రవీందర్ రావుమరియు యాదాద్రి భువనగిరి అధ్యక్షులు దొంతరబోయిన దైవాధీనం కోరారు. ఈ మేరకు రక్షా మంత్రాలయాన్ని అభ్యర్థిస్తూ రాజ్యసభలో ప్రజెంటు చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్. క్రిష్ణయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు.

## ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా దశాబ్ధి ఉత్సవాలు : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



హైదరాబాద్, మే27: దేవాదాయశాఖ తరపున తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ప్రతి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో శనివారం ఆయన ఆలయ భూముల సంరక్షణ, ధూప దీప నైవేద్యం, కామన్ గుడ్ ఫండ్, ప్రత్యేక అభివృద్ధి నిధులపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, దేవాదాయ భూముల సంరక్షణతో పాటు ఆలయాలకు వచ్చే భక్తులు సంతృప్తి చెందేలా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కొత్తగా చేపట్టిన ధూప దీప నైవేద్య పథకం వర్తింపు ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామన్ గుడ్ ఫండ్ నిధుల ద్వారా చేపట్టిన ఆలయాల అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దేవాదాయ శాఖ తరపున ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఆలయ భూములను కబ్జా నుంచి విడిపిస్తాం..

దేవాదాయ శాఖ భూముల లీజ్ రెంట్లు, భూ రికార్డుల ప్రక్షాళన, ఆలయ భూముల వేలం ప్రక్రియలో పారదర్శకత, ఆయా ఆలయాల పరిసరాల్లోని భూములు, స్థలాలు అన్యాక్రాంతం కాకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. అన్యాక్రాంతమైన దేవాదాయశాఖకు చెందిన భూములను తిరిగి రాబట్టే విషయంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి చెప్పారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా దశల వారీగా ఇప్పటి వరకు 6002 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో ఆక్రమణదారులకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఎప్పటికప్పుడు తగిన సమాచారాన్ని కోర్టుల ముందుంచాలన్నారు. భూముల విషయంలో కోర్టు కేసుల ప్రగతి ఎలా ఉందనే విషయంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి సీతారామచంద్ర ఆలయ భూముల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నామన్నారు. రామయ్య భూముల సంరక్షణకు ఏపీ ప్రభుత్వం సహకరించాలని మంత్రి కోరారు.

బాధ్యతయుతంగా పని చేయాలి

భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉండే దేవాదాయ శాఖపై లేనిపోని అబద్ధాలతో బురదజల్లేందుకు ప్రతిపక్షాలు కాచుకు కూర్చున్నాయని, ఏ చిన్న పొరపాట్లకూ తావివ్వకుండా బాధ్యతగా పనిచేయాలని ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. ఆలయాల ఆదాయాన్ని వాటి అభివృద్ధికే కేటాయిస్తున్నామని, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రభుత్వమే ప్రధాన ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

యాదాద్రిలో భక్తులకు వసతులు కల్పించాలి..

భక్తులు క్యూ లైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణంలో వేచి ఉన్న అన్ని సమయాలలో భక్తులకు మంచినీరు అందించాలని మంత్రి సూచించారు. అదేవిధంగా భక్తులు ఎండవేడిమి నుంచి సేదతీరేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వసతుల కల్పనలో ఆలస్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఇంద్రకరణ్ రెడ్డి ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కమిషనర్లు జ్యోతి, కృష్ణవేణి, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, స్తపతి వల్లినాయగం, ఈఈ, డీఈలు పాల్గొన్నారు.


నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ వరవరములు వెలుగులతో
యిరువైయెనిమిదవ తారీఖున పార్లమెంటు భవనమున్
నరవరుడు నరేంద్రుడు- తన
వరకరయుగ అమ్ము చేత ప్రారంభించునో॥



(మే 28-5-2023 నూతన పార్లమెంటు భవనం ప్రారంభం...)

-రాధశ్రీ

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం


## నేటి నుంచి 31 వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్స్

**-సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నీకీ ఘనంగా ఏర్పాట్లు**

**-క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు**

**-29వ తేదీ సాయంత్రం ఘనంగా ఆరంభ వేడుక ఏర్పాట్లు**

**-ఏర్పాట్లు సమీక్షించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్,**

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాథమిక అధికార సంస్థ (సాట్స్) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ ' 2023 నిర్వహణలో ఇటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, రాష్ట్ర ఎక్సైజ్ క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఈరోజు సీఎం కప్ ' 2023 ఏర్పాట్లను పరిశీలించటానికి ఎల్‌బి స్టేడియానికి విచ్చేసిన క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలతో మరియు సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కప్ పోటీలలో పాల్గొనడానికి విచ్చేస్తున్న క్రీడాకారులకు, క్రీడాకారిణిలకు భోజనం వసతి, టోర్నమెంట్ నిర్వహణ, సాంకేతిక విషయాల్లో మరియు ప్రారంభోత్సవ వేడుకల్లో ఎటువంటి లోటుపాటు రాకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. 29వ తేదీ నాడు జరిగే ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయాలని, ఇందులో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రతిబింబించేలా క్రీడాకారులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని, ఆయన సూచించారు. అంతకుముందు ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు, స్టేడియం ఇన్చార్జిలు, వివిధ సబ్ కమిటీల ఇన్చార్జులు మరియు ఇతర సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ, మండల స్థాయి, జిల్లా స్థాయిలో సీఎం కప్ క్రీడలకు అద్భుతమైన స్పందన లభించిందన్నారు. రెండు అంచెల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఎంతో సమన్వయంతో పనిచేసి రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారని అన్నారుఒక ఇంటి పండుగ లాగా, సంతోషకరమైన వాతావరణంలో ఈ క్రీడలను జరుపుకోవాలని అధికారులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు, క్రీడాకారిణిలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని క్రీడల్లో పాల్గొనే వారిని మరియు ఈ క్రీడలను సందర్శించడానికి వచ్చిన ప్రతి ఒక్కరితో ప్రేమపూర్వకంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. ఈ టోర్నమెంట్ నిర్వహణ అందరిలో మధుర స్మృతులు మిగల్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, క్రీడాకారులకు భోజనము వసతితో పాటు మెడికల్ సదుపాయాలు ఏ లోటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని, అత్యవసర పరిస్థితులలో ప్రతి స్టేడియంలో ఒక డాక్టర్ అందుబాటులో ఉండేలా స్టేడియం పరిసరాలలో సానిటేషన్ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిహెచ్ఎంసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన మందులు, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితిలో సమీప ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడానికి కూడా ముందస్తు ఏర్పాట్లతో ఉండాలని ఆయన సూచించారు. అన్ని సంబంధిత పనులు సమన్వయంతో, సమయస్ఫూర్తితో కట్టుదిట్టంగా చేపట్టి పండుగ వాతావరణంలో సీఎం కప్ క్రీడలు విజయవంతం చేయాలని చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఓఎస్‌డి డాక్టర్ లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, ధనలక్ష్మి, అనురాధ, దీపక్ మనోహర్, స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డి డాక్టర్ హరి కృష్ణ, క్రీడా శాఖ అధికారులు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ జిహెచ్ఎంసి మరియు మెడికల్ అండ్ హెల్త్ విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు.

# ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చక్కటి కార్యాచరణతో తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలు

మెదక్, మే27: (నేటినిజం ప్రతినిధి): జూన్ 2 నుండి చేపట్టనున్న తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో సాధించిన ప్రగతి ప్రస్థానాన్ని ప్రజలకు వివరించే విధంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండాచక్కటి కార్యాచరణతో కార్యక్రమాలు చేపట్టవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వచ్చే జూన్ నాటికి తొమ్మిదేండ్లు పూర్తి చేసుకుని 10 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు పండుగ వాతావరణంలో రోజు ఒక కార్యక్రమం చొప్పున జూన్ 22 వరకు వివిధ శాఖల ద్వారా అమలుపరుస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టుటకు షెడ్యూల్ ప్రకటించిందని అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్ లతో కలిసి ఆయా శాఖల నోడల్ అధికారులు చేపట్టవలసిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9 ఏండ్ల తెలంగాణ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని, రాష్ట్రం వచ్చిన కొత్తలో బాలారిష్టాలు, డి-మానిటైజేషన్, కోవిడ్ తదితర కారణాల వల్ల ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయిన అతి తక్కువ సమయంలో దేశం గర్వించదగ్గ స్థాయిలో అన్ని రంగాలలో పురోగమించామన్నా సందేశాన్ని ప్రజలకు చేరే విధంగా వినూత్న రీతిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తమ శాఖ ఇచ్చే ఆదేశాల తో పాటు కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం 2014 కు పూర్వం ఇప్పటి వరకు సాధించిన ప్రగతి పై నియోజక వర్గం వారీగా, గ్రామ, మండల వారీగా వెంటనే నివేదిక అందజేయవలసినదిగా సూచించారు. ఆదివారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామంత్రి మెదక్ లో సమీక్షించనున్నారని కలెక్టర్ తెలిపారు. నోడల్ అధికారులు తమ కార్యక్రమాల రోజు నాడు-నేడు పరిస్థితులపై అద్దంపట్టే విధంగా రూపొందించిన ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కరపత్రం, పుస్తకాలూ ముద్రించి తమ కార్యక్రమం రోజు పంపిణి చేయాలని అన్నారు. సమగ్ర సమాచారం తమ క్రింది స్థాయి అధికారులకు తెలిసేలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల విజయగాథలు, అభిప్రాయాలను నలుగురికి తెలపాలని అన్నారు. తమ కార్యక్రమాల రోజు ప్రజాప్రతినిధులు, లబ్దిదారులను ఆహ్వానించాలని, చక్కటి ఫ్లవర్ డెకరేషన్ తో పాటు మూడు రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రధాన కార్యాలయాలు, ఏడుపాయల, ఖిల్లా, చర్చి ప్రదేశాలను 21 రోజులపాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అన్ని మునిసిపాలిటీలలో, జిల్లా ప్రవేశం, ముగింపు ప్రాంతాలలో, జంక్షన్ లలో ఆర్చీలు , ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు నిర్వహించిన కార్యక్రమం అంతయు డాక్యుమెంటేషన్ తో పాటు వీడియో చిత్రీకరణ చేసి డాక్యుమెంతరి రూపంలో అందించాలని సూచించారు. 21 రోజుల కార్యక్రమ వివరాలు : జూన్ 2న జిల్లా ఇంచార్జి మంత్రి చిన్న శంకరంపేట లో అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని అన్నారు. ఈ సందర్భంగా స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 3న జిల్లాలోని అన్ని రైతు వేదికలలో జరపాలని, ఇందులో వ్యవసాయ రంగంలో సాధించిన విజయాలు, ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భీమా తదితర పథకాల విశిష్టతను, పంట కాలం ముందు అంశాలపై తెలంగాణా రైతు దినోత్సవాన్నిజరపాలన్నారు. . తెలపాలన్నారు. 4 న సురక్ష దినోత్సవంలో భాగంగా పోలిసు శాఖ ఆధ్వర్యంలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మునిసిపాలిటీలలో ర్యాలీలు నిర్వహించి శాంతిధారతాలకు పోలీసులు చేస్తున్న కృషి, ఫ్రెండ్లీ పోలిసు విధానాన్ని వివరాయించాలన్నారు. జూన్ 5 న విద్యుత్ రంగంలో సాధించిన గుణాత్మక మార్పుపై తెలంగాణ విద్యుత్తు విజయోత్సవం నిర్వహించాలన్నారు. . జూన్ 6న పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో తెలంగాణ పారిశ్రామిక ప్రగతిపై సభలు నిర్వహించి , టీఎస్ ఐపాస్, పరిశ్రమల స్థాపన, అను మతులు సులభతరమైన విషయాలను తెలియజేయాలన్నారు. జూన్ 7వ సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ సాగునీటి దినోత్సవం సభలు నిర్వహించాలన్నారు. జూన్ 8న ఊరూరా చెరువుల పండుగ పేర చెరువు కట్టలపై సభలు, బతుకమ్మ పండుగ నిర్వహించాలన్నారు. జూన్ 9 న తెలంగాణ సంక్షేమ సంబురాలలో భాగంగా నియోజక వర్గ స్థాయిలో అందించిన ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి తదితర అంశాలతో పాటు 2వ విడత గొర్రెల పంపిణి, వివిధ గ్రామీణ వృత్తి పనుల వారికి ఆర్థిక ప్రేరణ కింద లక్షరూపాయల పంపిణీ చేపట్టాలన్నారు. జూన్ 10న తెలంగాణ సుపరి పాలన దినోత్సవం లో భాగంగా జిల్లా లో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలు, మండలాలు మున్సిపాలిటీలు, రెవిన్యూ డివిజన్ ల వివరాలు, ధరణి సౌలభ్యంపై వివరించాలన్నారు. జూన్ 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం నాడు జిల్లా స్థాయిలోతెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవి సమ్మేళనం నిర్వహించాలన్నారు. జూన్ 12న అన్ని నియోజకవర్గ కేంద్రా లలో యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారుల తోతెలంగాణ రన్ ను నిర్వహించాలన్నారు. జూన్ 13 న తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం నాడు నియోజకవర్గం కేంద్రంలో మహిళా సదస్సు నిర్వహించాలన్నారు. జూన్ 14న తెలంగాణ వైద్యా ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి, వైద్య ఆరోగ్య రంగంలో తెలం గాణ సాధించిన ప్రగతిని పేర్కొనాలని సూచించారు. జూన్ 15 న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించాలని, ప్రతి గ్రామ పంచాయతీ ముందు జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. జూన్ 16న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించి సఫాయి అమ్మ-సలాం అమ్మ, సఫాయి అన్న-సలాం అన్న నినాదంతో సఫాయి కార్మికులను సన్మానించాలన్నారు. మున్సి పాలిటీల ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగుర వేయాలన్నారు. జూన్ 17న తెలంగాణ గిరిజనోత్సవం నాడు గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించాలని, గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరించాలన్నారు. జూన్ 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ కార్యక్రమం ద్వారా మిషన్ భగీరథ దారా ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీటి సరఫరా , మిషన్ భగీ రథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీ ట్మెంట్ ప్లాంట్ల పై అవగాహన కలిగించాలన్నారు. జూన్ 19న అన్ని గ్రామాలు పట్టణాలలో తెలంగాణ హరితోత్సవం లో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. జూన్ 20 న విద్యాదినోత్సవం నిర్వహించి, మన ఊరు మన బడి క్రింద సిద్ధమైన పాఠశాలలతో పాటు గ్రంథాలయాలు, డిజిటల్ క్లాస్ రూమ్ లను ప్రారంభించాలని అన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించాలన్నారు. జూన్ 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినో'త్సవం నిర్వహించాలని, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన మందిరాలకు అలంకరణ, ప్రముఖ క్షేత్రాల్లో ప్రత్యేక భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. చివరగా జూన్ 22న అమరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఊరురా గ్రామ పంచాయతీ లు ఉదయం 11 గంటలకు సమావేశం కావాలని, అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు వెంకట శైలేష్, చందు నాయక్, యేసయ్య, సత్యనారాయణపై రెడ్డి, జయరాజ్, కృష్ణ మూర్తి, ఖాసీం, రవి ప్రసాద్, విజయశేఖర్ రెడ్డి, భీమయ్య, రాధ కిషన్, రాజి రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, కమలాకర్ , శ్రీనివాస్, నాఅగరాజ్, ఆశా కుమారి, బహ్మాజి, రజిని ,ఇందిర, మునిసిపల్ కమిషనర్లు, ఆర్.డి.ఓ సాయిరాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ-బీఆర్ఎస్ రెండూ దగ్గరవుతున్నాయా..?

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీ-బీఆర్ఎస్ రెండూ దగ్గరవుతున్నాయా.. అందుకే ఈ మధ్య అటు బీజేపీని బీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ను బీజేపీ విమర్శించుకోవట్లేదా.. మరీ ముఖ్యంగా మోదీ సర్కార్ అంటే ఒంటికాలిపై లేచే గులాబీ బాస్ కేసీఆర్ ఇందుకే సైలెంట్ అయ్యారా.. తెలంగాణలో అవసరమైతే బీఆర్ఎస్సే గెలవాలే తప్ప కాంగ్రెస్ మాత్రం అస్సలు గెలవకూడదని బీజేపీ కోరుకుంటోందా.. తెలంగాణలో గెలుపోటములు కంటే పార్టీ జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని బీజేపీ భావిస్తోందా.. అంటే ఇదే అక్షరాలా నిజమని అటు ఢిల్లీలో.. ఇటు తెలంగాణలో జరుగుతున్న తాజా పరిణామాలను బట్టి చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అసలేం నడుస్తోంది.. బీజేపీ మాస్టర్ ప్లానేంటి.. అధికారంలోకి వచ్చేస్తున్నాం.. రోజులు లెక్కపెట్టు కోండని చెప్పిన బీజేపీ.. ఇప్పుడు సడన్‌గా ఎందుకు ఢీలా పడిపోయిందనే విషయాలు చూస్తే తెలంగాణలో అధికార పార్టీ బీఆర్ఎస్‌కు అసలు సిసలైన ప్రధాన ప్రతిపక్షమన్నా, రెండో స్థానంలో ఉండేది ఏ పార్టీ అంటే.. కాంగ్రెస్సే అని రాజకీయ విశ్లేషకులు రాష్ట్ర ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు. అయితే ఎప్పటికప్పుడు ఈ విషయాలను బీజేపీ ఖండిస్తూ.. తామే ప్రధాన ప్రతిపక్షమని అంతేకాదు రానున్న ఎన్నికల్లో గెలవబోతున్నామని కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కమలనాథులు చెప్పుకుంటూ వస్తున్నారు. కేసీఆర్ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని కౌంట్ డౌన్‌తో కూడా బోర్డులు సైతం బీజేపీ ప్రధాన కార్యాలయం దగ్గర దర్శనమిచ్చాయ్. అయితే ఇదంతా గతం.. ఇప్పుడు మొత్తం మారిపోయింది. తాము అధికారంలో రావడం సంగతి దేవుడెరుగు కానీ.. కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి రాకూడదని బీజేపీ భావిస్తోంది. ఇదంతా రాష్ట్రంలో ఉండే బీజేపీ నేతలు అనుకుంటున్నారంటే తప్పులు కాలేసినట్లే.. కేంద్ర పెద్దలే భావిస్తున్నారని తెలంగాణకు చెందిన బీజేపీ జాతీయ నేతే 'చిట్‌చాట్'లో చెప్పడం ఇప్పుడు వ్యవహారం గల్లీ నుంచి ఢిల్లీ వరకూ హాట్ టాపిక్ అవుతోంది. అంతేకాదు.. కేసీఆర్ వ్యతిరేక అంశం నిర్మించడంలో బండి సంజయ్ విఫలమయ్యారని బీజేపీ నేతే చెబుతుండటం గమనార్హం. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రస్తుతానికి తెలంగాణ బీజేపీలోకి వలసలు మాత్రం అస్సలే ఉండవని.. ప్రస్తుతానికి వలసలు క్లోజ్ అయ్యాయని ఢిల్లీ వేదికగా చెప్పడం ఇప్పుడే వ్యవహారంపైనే ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. ఏ ఇద్దరు కలిసినా బీజేపీ-బీఆర్ఎస్ గురించే చర్చించుకుంటున్నారు.

# పర్యావరణం కోసం స్వచ్ఛతాభీ ఔర్ జీవనశైలిభీ

న్యూఢిల్లీ, మే27 స్వచ్ఛత అనేది పౌరులు తమ దైనందిన జీవనశైలిలో అలవర్చుకున్న అలవాటు. తగ్గింపు, రీసైకిల్, పునర్వినియోగం అనేది పట్టణ స్వచ్ఛతలో అంతర్గత భాగం మరియు మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షెహర్ ప్రచారం పౌరుల నేతృత్వంలోని అటువంటి చారిత్రాత్మక ఉద్యమంగా రూపాంతరం చెందింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ప్రారంభించబడిన దాదాపు 13,000 తగ్గింపు, పునర్వినియోగం, రీసైకిల్ కేంద్రాలు, 17 లక్షల కంటే ఎక్కువ మంది పౌరులు తమ ఉపయోగించని వస్తువులు, పాత పుస్తకాలు, బట్టలు, బొమ్మలు మొదలైనవాటిని స్వచ్ఛందంగా విరాళంగా ఇస్తున్నారు. ఈ వస్తువులు పునర్నిర్మించబడతాయి మరియు పునర్వినియోగం చేయబడతాయి. స్వచ్ఛత కోసం, పౌరులు దానిని జన ఆందోళన్‌గా మార్చడానికి ఎంతైనా చేయాల్సి ఉంటుంది.

కర్ణాటక పౌరులు సమీపంలోని ఆర్ ఆర్ ఆర్ సెంటర్‌లో సైకిల్‌ను విరాళంగా అందిస్తారు

దేశవ్యాప్తంగా, అన్ని వర్గాల పౌరులు సంగీత వాయిద్యాలు, ఉపయోగించని ప్లాస్టిక్ బాటిళ్ల వరకు, పాత మిక్సర్ గ్రైండర్ల నుండి సైకిల్ వరకు, 3 ఆర్ మంత్రాన్ని అవలంబిస్తూ, పౌరులు ఉదారంగా డిపాజిట్ చేస్తున్నారు.

కర్ణాటకలోని పౌరులు సమీపంలోని ఆర్ ఆర్ ఆర్ సెంటర్‌లో సైకిల్‌ను విరాళంగా అందజేస్తుండగా, రాయ్‌పూర్‌లోని ప్రజలు గిటార్ మరియు హార్మోనియం వంటి సంగీత వాయిద్యాలను డిపాజిట్ చేశారు. రాయ్‌పూర్‌లోని 70 వార్డుల నుండి, 1200 మంది పౌరులు మొదటి రోజున ఆర్ ఆర్ ఆర్ కేంద్రానికి సహకరించారు. మహిళా స్వయం సహాయక బృందాలు , స్వచ్ఛతా దీదీలు మరియు ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా సహాయం అందించడానికి ఖాండ్వాలోని వివిధ మహిళా సంఘాలు, ఇంటింటికీ తిరిగి పాత బట్టలు, బూట్లు మరియు ఇతర ఉపయోగించిన వస్తువులను సేకరించేందుకు వెళ్లారు. ఇప్పటి వరకు 500 బట్టలు సేకరించారు. పంజాబ్‌లోని మహిల్‌పూర్‌లో, కళాశాల విద్యార్థులు ప్రాంగణంలో ఆర్ ఆర్ ఆర్ కేంద్రాన్ని తెరవడానికి కలిసి వచ్చారు. ఘజియాబాద్‌లో.. నగరంలోని 5 ఆర్ ఆర్ ఆర్ కేంద్రాలను నిర్వహించడానికి 35 స్వచ్ఛంద సంస్థలు మరియు 24 రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీలు కలిసి వచ్చాయి. కర్ణాటకలోని దాదాపు 450 ఆర్ ఆర్ ఆర్ కేంద్రాలను 20,000 మంది పౌరులు సందర్శించారు. పౌరులు ఉపయోగించిన ప్లాస్టిక్, బట్టలు, పాత పుస్తకాలు మరియు పాదరక్షలను సేకరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా పౌరులు విరాళంగా అందజేసే బట్టలతో బ్యాగులను తయారు చేయడంలో నిమగ్నమై ఉన్నాయి. కేరళలోని కోజికోడ్, త్రిపుర నుండి ఖోవాయి, పంజాబ్‌లోని ధురి, మహారాష్ట్రలోని నవీ ముంబై, గోవాలోని మార్గావ్ మరియు మరెన్నో పౌరులు ఆర్ ఆర్ ఆర్ కేంద్రాలకు ఉపయోగించని వస్తువులను అందజేస్తున్నారు.

ఇదొక్కటే కాదు నవీ ముంబై పౌరులు డి-మార్ట్‌తో కలిసి మొదటి రకమైన రీసైకిల్ మార్ట్‌ను కూడా పొందారు. ఇక్కడ రోజువారీ ఉపయోగించిన వస్తువులను ట్రాష్‌గా భావించి, రోజువారీ షాపింగ్ అవసరాల కోసం డి-మార్ట్‌లో రీడీమ్ చేయగల కూపన్‌లను సంపాదించడానికి ట్రేడ్ చేయవచ్చు. పన్వేల్‌లో పౌరులు 25 కిలోల పాత బూట్లు మరియు చెప్పులను ఉదారంగా విరాళంగా ఇచ్చారు. కొన్ని ప్రత్యేకమైన మరియు వినూత్న కార్యక్రమాలు కూడా మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షెహర్ ప్రచారాన్ని ఆసక్తికరంగా మారుస్తున్నాయి. మనేసర్‌లోని పాఠశాల విద్యార్థులు పెయింటింగ్ పోటీలో పాల్గొన్నారు మరియు ఆర్ ఆర్ ఆర్ థీమ్ ను గోడలు మరియు పాత టైర్లపై పెయింట్ చేశారు. మనేసర్ పౌరులుఆర్ ఆర్ ఆర్ కోసం మానవ గొలుసును కూడా ఏర్పాటు చేశారు. పూణేలోని పింప్రి-చించ్వాడ్ వారి ఆర్ ఆర్ ఆర్ కేంద్రాన్ని వ్యర్థ పదార్థాలతో రూపొందించారు.

పౌరులు, వాలంటీర్లు, ఆర్డబ్ల్యూఏ సభ్యులు, స్వయం సహాయక బృందాలు గ్రూపులు, తులిప్ ఇంటర్న్‌లు అందరూ స్వచ్ఛ్ షెహర్‌ను రూపొందించడంలో భాగస్వాములయ్యారు. ఆర్ ఆర్ ఆర్ కోసం పుష్ చేయడానికి నిజంగా ఒక ప్రత్యేకమైన మార్గం.

# కేసీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేయకముందే తల నరుక్కోవాలి



తెలంగాణ సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం సాయంపై చర్చకు సిద్ధమని కేసీఆర్‌కు కిషన్ రెడ్డి సవాలు విసిరారు. తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా డబ్బులు పంచడం కోసమే 111 జీవో రద్దు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు 111 జీవో పరిధిలో వందలాది ఎకరాలున్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కలసి మాట్లాడుకుని కార్యాలయాలకు భూములు తీసుకున్నారని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబానికి భూ దాహం, అప్పుల దాహం తీరటం

-తెలంగాణకు కేంద్రం సాయంపై చర్చకు కేసీఆర్ సిద్ధమా?

-తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కంపెనీగా మారింది

- తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం

హైదరాబాద్ మే 27 న్(ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ టార్గెట్‌గా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో సీఎంగా ప్రమాణస్వీకారం చేయక ముందే కేసీఆర్ తల నరుక్కోవాలని వ్యాఖ్యానించారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు సహా కొన్ని వందల సార్లు లేదని ధ్వజమెత్తారు. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం కేసీఆర్ హాజరుకావపోవటం తెలంగాణకు తీవ్ర నష్టం అన్నారు. నీతి ఆయోగ్ సమావేశం కంటే కేసీఆర్‌కు ముఖ్యమైన పని ఏ ముందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# డిగ్రీ పట్టా అందుకున్న శునకం..

న్యూజెర్సీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: డిగ్రీ పట్టా అందుకున్న ఓ శునకం అందరి మనసుల్ని దోచింది. న్యూజెర్సీలోని సెటాన్ హాల్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సెర్మనీలో విద్యార్థినితో పాటు ఆ శునకం కూడా పట్టాను అందుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. సెటాన్ వర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ చదివిన మారియానీ అనే అమ్మాయి డిగ్రీ పట్టా అందుకోవాల్సి ఉంది. అయితే చాన్నాళ్ల నుంచి వీల్‌చైర్‌పై ఉన్న ఆమెకు జస్టిన్ అనే శునకం కూడా తోడుగా ఉంటోంది. తాజాగా ఆ వర్సిటీ గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించింది. ఆ వేడుకకు వీల్‌చైర్‌లో వచ్చిన ఆమె తనతో పాటు కుక్కను కూడా తీసుకువచ్చింది. ఆ సమయంలో వర్సిటీ ఇంచార్జి.. ఆ శునకానికి డిగ్రీ పట్టాను అందజేశారు. ఆ గౌరవ పట్టాను శునకం తన నోటితో అందుకున్నది. ఆ సమయంలో విద్యార్థులు కేరింతలు చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియోను ఆ వర్సిటీ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం-2023 కు 25 రోజుల కౌంట్ డౌన్ సందర్భంగా 'యోగా మహోత్సవ్'

న్యూఢిల్లీ, మే27 ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మొరాజీ దేశాయ్ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ యోగా (ఎం డి ఎన్ ఐ వై) రేపు (2023 మే 27) సికింద్రాబాద్ ఎన్ సి సి పరేడ్ గ్రౌండ్ లో మెగా 'యోగా మహోత్సవ్'ను నిర్వహిస్తోంది. 2023 జూన్ 21న మధ్యప్రదేశ్లోని జబల్పూర్ లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 25 రోజుల కౌంట్ డౌన్ ప్రారంభ కార్యక్రమంగా ఈ మెగా 'యోగా మహోత్సవ్'ను నిర్వహిస్తున్నారు. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలరవాణా, ఆయుష్ శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ హైదరాబాద్ లో విలేకరుల సమావేశం లో ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, 'వసుధైక కుటుంబం కోసం యోగా' అనే ఈ ఏడాది ఐ డి వై ఇతివృత్తాన్ని ప్రకటించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విస్తృత ప్రణాళికలు రూపొందిస్తున్నామని శ్రీ సోనోవాల్ వివరించారు.

జూన్ 21న ఓషన్ రింగ్ ఆఫ్ యోగాను ఏర్పాటు చేస్తామని, రక్షణ మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ సహకారంతో అనేక ఓడరేవుల్లో ప్రధాన యోగా ప్రదర్శనలు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో అనేక దేశాలు కూడా చేరే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఆర్కిటిక్ నుంచి అంటార్కిటికా వరకు యోగా ప్రదర్శనలు జరుగుతాయని, ప్రధాన మెరిడియన్ రేఖపై లేదా సమీపంలో ఉన్న దేశాలు యోగా ప్రదర్శనలో పాల్గొంటాయని మంత్రి చెప్పారు. ఉత్తర, దక్షిణ ధ్రువ ప్రాంతాల్లో కూడా యోగా చేయనున్నారు. ఆర్కిటిక్ లోని స్వాల్బార్డ్ లో భారత పరిశోధనా స్థావరం అయిన హిమాద్రి, , అంటార్కిటికా లోని మూడవ భారతీయ పరిశోధనా స్థావరమైన భారతి కూడా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది తో కలసి ఈ ఉత్సవంలో పాల్గొనే అవకాశం ఉంది. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఫ్లైట్ డెక్స్ లో కూడా యోగా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

యోగా అందరికీ బంధం వేస్తుందని, ఇది అన్ని రకాల అడ్డంకులను కరిగించడానికి సహాయపడుతుందని ఆయుష్ మంత్రి అన్నారు. యోగాలోని ఈ స్వాభావిక లక్షణం, మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అలుపెరగని కృషి ఫలితంగానే యోగా ప్రభావం , ప్రపంచ సమాజం దానిని ఆమోదించడం అంతకంతకూ పెరుగుతోంది. నేడు, ప్రపంచం మొత్తం యోగాను సంపూర్ణ ఆరోగ్యం ,శ్రేయస్సు కు తిరుగులేని సాధనంగా అంగీకరిస్తోంది. రేపు ఉదయం వేలాది మంది ఈ ఆరోగ్యకరమైన మానసిక, శారీరక యోగా ఉద్యమంలో చేరతారు, ఇక్కడ వారు కామన్ యోగా ప్రోటోకాల్ (సి వై పి)ని నిర్వహిస్తారు . మానవాళి శ్రేయస్సు కోసం సందేశాన్ని పంపుతారు. వసుధైక

కుటుంబం కోసం యోగా అనే ఈ సంవత్సరం నినాదం స్పష్టమైన ప్రతిబింబాన్ని హైదరాబాద్ ప్రజలు ప్రదర్శిస్తారు, ఎందుకంటే వారి ప్రత్యేక వ్యక్తిత్వాలతో సంబంధం లేకుండా, విశ్వ సోదరభావం ,స్నేహ భావాన్ని సాధించడానికి మనమందరం ఎలా చేతులు కలపవచ్చో వారు చూపిస్తారు.

హైదరాబాద్ ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందనతో 2023 జూన్ 21న మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతుంది.

విలేకరుల సమావేశం లో పాల్గొన్న కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, యోగా మంచి మనసుకు, శరీరానికి అమృతం వంటిది అని అన్నారు. వేలాది మంది ఇతర యోగా ఔత్సాహికులతో కలిసి మనం చేరుతున్నప్పుడు, వేలాది మంది మెరుగైన జీవన నాణ్యతను గడిపే యుగంలోకి మనం ప్రవేశిస్తాము. ఇంకా కొత్త, దృఢమైన , సానుకూల భారతదేశాన్ని నిర్మించడాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రధాన దార్శనికత లలో ఒకదాన్ని నెరవేరుస్తాము.

దేశవ్యాప్తంగా యోగా మహోత్సవాలు నిర్వహించే ఈ ప్రత్యేక ప్రచారంలో హైదరాబాద్ భాగస్వామ్యం కావడం అదృష్టం. ఈ యోగా మహోత్సవ్ పట్ల సాధారణ ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా, ఈ ప్రాంతంలో యోగా ఆధారిత పర్యాటకానికి హైదరాబాద్ కేంద్రంగా మారడానికి కూడా ఈ ఉత్సవం దోహదపడుతుంది" అన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాభారత్ మాలలో భారత సైన్యం, భారత వైమానిక దళం, కోస్ట్ గార్డ్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ కూడా పాల్గొంటాయని విలేకరుల సమావేశం లో పాల్గొన్న కేంద్ర మహిళా ,శిశు అభివృద్ధి ,ఆయుష్ సహాయ మంత్రి డాక్టర్ ముంజ్పారా మహేంద్ర భాయ్ కాలూభాయ్ తెలిపారు. 'భారతదేశంలోని 2 లక్షలకు పైగా గ్రామాల్లో కామన్ యోగా ప్రోటోకాల్ (సివైపి) లో ప్రజలకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు జరిగాయి' అని విలేకరుల సమావేశంలో చెప్పారు.

యోగా మహోత్సవ్ కు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, డోనర్ శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి , కేంద్ర మహిళా శిశు అభివృద్ధి, ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజ్పారా మహేంద్రభాయ్ కాలూభాయ్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా తదితరులు హాజరవుతారు. యోగా మహోత్సవ్ ను ఎం డి ఎన్ ఐ వై డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర బసవరెడ్డి నిర్వహించనున్నారు.

# రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 8న ఊరూరా చెరువుల పండుగ

మెదక్, మే27: (నేటినిజం ప్రతినిధి):రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 8 న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పటు చేపల ఆహార పండుగ నిర్వహించనున్నామని జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ రజిని అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని ఆడిటోరియం లో జిల్లాలోని మత్స్య కార సహకార సంఘాలకు నిర్వహి ంచిన అవగాహన కార్యక్రమంలో ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 8 న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. జూన్ 9, 10 తేదీలలో స్థానిక ద్వారకా గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు చేపల దుకాణాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ లో మత్స్య సహకార సంఘాల సభ్యులు లైవ్ ఫిష్ (బ్రతికి ఉన్న చేపలు), పచ్చి చేపలు, కొర్రమీనులు, వివిధ చేపల ఆహార ఉత్పత్తులు, చేపల బిర్యానీ, రొయ్యల బిర్యాని, చేపల పచ్చళ్ళు, ఫిష్ ఫ్రేయ్ ,తో పాటు పాల ఉత్పత్తులు దుకాణం, పశు సంవర్ధక శాఖ కూడా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నదని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రుచికరమైన చేపల పదార్థాలను ఆస్వాదించవలసినదిగా ఆమె కోరారు. అదేవిధంగా ఆయా గ్రామాలలోని సహకార సంఘాల మత్స్య కారులు తమ వలలతో బతుకమ్మల ఊరేగింపుతో చెరువుల వద్ద సహపంక్తి భోజనాలతో పాల్గొనాలని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ లో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు పాల్గొనాలని కోరారు. మత్స్యకారుల గుర్తింపు కార్డులకు సంబందించిన సమాచారాన్ని కార్యాలయంలో తెలుపవలసినదిగా ఆయా సంఘాల అధ్యక్షులకు సూచించారు.

# తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన మహా నేత ఎన్టీఆర్

-జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జ్ కర్రి వేణుమాధవ్

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలుగు జాతికి గుర్తింపు తీసుకొచ్చిన మహా నేత నటరత్న నందమూరి తారక రామారావు అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జ్ కర్రి వేణుమాధవ్ కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నటరత్న నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ ఏపీ భవన్ మీడియా సెంటర్లో ఘనంగా నిర్వహించారు. అన్న నందమూరి తారక రామారావు గారి చిత్రపటానికి పూలమాలవేసి తెలుగువారి సమక్షంలో ఘనంగా నివాళు ్ళ అర్పించారు. ఈ సందర్భంగా తమ సంగం ఆద్వర్యంలో శతజయంతి ఉత్సవాలు చేస్తున్నట్టుగా కర్రి వేణుమాధవ్ తెలియజేశారు ఈ సందర్భంగా ఢిల్లీలో ఉన్న వివిధ సంఘాల వారందరూ కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అత్యాధునిక హంగులతో.. నిర్మల్ బస్ స్టేషన్ కమర్షియల్ కాంప్లెక్స్



నిర్మల్ ,మే27: నిర్మల్ టిఎస్ ఆర్టిసి బస్ స్టేషన్ ను మరింత అభివృద్ధి చేసేందుకు దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు టిఎస్ఆర్టిసి చైర్మన్, నిజామాబాద్ గ్రామిణ నియోజకవర్గ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్..నిర్మల్ టిఎస్ఆర్టిసి ప్రయాణికుల ప్రాంగణాన్ని కమర్షియల్ కాంప్లెక్స్ గా నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. నూతనంగా నిర్మించే టిఎస్ ఆర్టిసి కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద సెల్లార్ .. జి ? ఫ్లస్ వన్, శుభకార్యాలకు నిర్వహించే హాల్, లక్ష ఎస్ఎఫ్టి తో నిర్మాణం చేయడం జరుగుతుంది.. టిఎస్ ఆర్టిసి ద్వారా 35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కమర్షియల్ కాంప్లెక్స్ లలో 53 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని ? సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గారు వెల్లడించారు..కాగా నేడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో .. బాజిరెడ్డి గోవర్ధన్ రు నిర్మల్ బస్టాండులో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ఆర్టీసీ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు..బాజిరెడ్డి గోవర్ధన్ రాష్ట్రంలో ఉన్న అన్ని బస్టాండులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు..ఈ సమీక్ష సమావేశంలో ఆర్టిసి అధికారులు ఈడిఈ వినోద్ కుమార్ , సిటిఎం విజయ్ కుమార్ , సీసీఈ రాంప్రసాద్, సివిల్ ఇంజనీర్ మహేష్ ఇతర ఆర్టీసీ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలోనే గిరిజనులు గుర్తుకొస్తారా.. పొంగులేటి




ఖమ్మం, మే27: (నేటినిజం ప్రతినిధి): ప్రతి పోడు రైతుకు పట్టా మంజూరు చేయాలని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఇల్లందు క్రాస్ రోడ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన పోడు రైతు భరోసా ర్యాలీ విజయవంతం అయింది. ఈ కార్యక్రమానికి వందలాది మంది పోడు రైతులు, నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. గిరిజనులు, ఆదివాసీలు, గిరిజనేతరులు తరతరాల నుండి సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడంలో మీన మేషాలు లెక్కించడం తగదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాల కాలం గడిచిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు గిరిజనేతరులకు పోడు పట్టాలు జారీ చేస్తామని మాయ మాటలు చెప్పి ఇంతవరకు ఏ ఒక్క పోడు రైతుకు పట్టాలు జారీ చేయలేదని, ఎన్నికల సమయంలో గిరిజనులు, పోడు రైతులు గుర్తుకొస్తారని ఎన్నికల అనంతరం ఏ ఒక్కరిని పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.

2018 ఎన్నికల సమయంలో ప్రతి పోడు రైతుకు నేనే స్వయంగా కుర్చీ వేసుకుని కూర్చొని పట్టాలిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. వేలాది మంది గిరిజన కుటుంబాల ఉసురుపోసుకున్నారని, పోడు రైతుల కుటుంబాలను రోడ్డుపాలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. సుమారు నాలుగు లక్షల 14 వేల కుటుంబాలు 13 లక్షల ఎకరాల పోడు పట్టాల కొరకు దరఖాస్తులు చేసుకోగా డిసెంబర్ నెలలో 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వనున్నామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఇప్పుడు కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే పోడు పట్టాలు ఇవ్వడం సాధ్యమవుతుందని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. పోడు పట్టా కొరకు దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మరణించిన ప్రతి పోడు రైతు కుటుంబానికి 20 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనుల మీద అక్రమ కేసులు బనాయించారని అవి తక్షణమే తొలగించాలని అన్నారు. అర్హులైన ప్రతి పోడు రైతుకు పట్టాలు మంజూరు చేయాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భారీ ర్యాలీ అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన సమయంలో కలెక్టర్ ఛాంబర్ కు తాళం వేసి ఉండటంతో ఛాంబరు తలుపుకు పరిస్థితిని వివరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందించి పోడు సమస్యలు పరిష్కరించమని కోరారు. ఈ కార్యక్రమంలో పొంగులేటితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, డాక్టర్ తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, ఊకంటి గోపాలరావు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# సోనియా, రాహుల్, ప్రియాంకలకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆదాయపు పన్ను శాఖ తీసుకున్న ఓ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా దాఖలు చేసిన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఆయుధాల డీలర్ సంజయ్ భండారీకి సంబంధించిన కేసులో వీరి అసెస్మెంట్లను సాధారణ అసెస్‌మెంట్‌కు బదులుగా సెంట్రల్ సర్కిల్‌కు ఆదాయపు పన్ను శాఖ బదిలీ చేయడంపై వీరు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంజయ్ గాంధీ స్మారక ట్రస్ట్, జవహర్ భవన్ ట్రస్ట్, రాజీవ్ గాంధీ ఫౌండేషన్, రాజీవ్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్, యంగ్ ఇండియన్, ఆమ్ ఆద్మీ పార్టీ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను కూడా హైకోర్టు తోసిపుచ్చింది.

సోనియా రాహుల్ ప్రియాంక లకు చెందిన అసెస్‌మెంట్ ఇయర్ 2018-19కి సంబంధించిన కేసుల ను సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వీరు సవాల్ చేశారు. సంజయ్ భండారీ కేసులతో తమకు సంబంధం లేదని వాదించారు. జస్టిస్ మన్మోహన్, జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ ధర్మాసనం తీర్పు చెప్తూ, సోనియా, రాహుల్, ప్రియాంకల అసెస్‌మెంట్లను చట్ట ప్రకారమే సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేశారని తెలిపింది. రిట్ పిటిషన్లను తోసిపుచ్చుతున్నట్లు తెలిపింది. సాహచర్యం లేదా బంధుత్వం వల్ల నేరం జరగదనేది నిస్సందేహమేనని తెలిపింది. సమన్వయంతో కూడిన దర్యాప్తు కోసమే ప్రస్తుత కేసుల్లో అసెస్‌మెంట్లను బదిలీ చేశారని తెలిపింది. సెంట్రల్ సర్కిల్ అధికార పరిధి కేవలం సెర్చ్ కేసులకు మాత్రమే పరిమితం కాదని చెప్పింది. రూపం లేని అసెసింగ్ ఆఫీసర్ చేత అసెస్‌మెంట్ చేయించుకునే ప్రాథమిక హక్కు కానీ, చట్టబద్ధ హక్కు కానీ అసెసీలకు లేదని స్పష్టం చేసింది. ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగానికి అనుబంధంగా సెంట్రల్ సర్కిల్ పని చేస్తుంది. సోదాల్లో సేకరించిన సాక్ష్యాధారాలను సెంట్రల్ సర్కిల్ స్వాధీనం చేసుకుంటుంది. కేసును తార్కిక ముగింపునకు తీసుకొస్తుంది. గాంధీల ఐటీ అసెస్‌మెంట్‌ను సెంట్రల్ సర్కిల్ పూర్తి చేస్తుంది. అవసరమైన పెనాల్టీలను విధిస్తూ ఆదేశాలు జారీ చేస్తుంది. పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రొసీడింగ్స్‌ను ఇన్వెస్టిగేషన్ వింగ్ ప్రారంభించవచ్చు.

# తెలంగాణ రాజకీయాల్లో మారిపోతున్న స్క్రిప్టులు

హైదరాబాద్ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎన్నికలు దగ్గరపడుతుండటంతో తెలంగాణ రాజకీయాల్లో స్క్రిప్టులు మారిపోతున్నాయ్. ఏ పార్టీలో అయితే తమకు అనుకూలంగా ఉంటుందో.. ఏ పార్టీ అయితే టికెట్ హామీ ఉంటుందో అక్కడికి చేరిపోతున్నారు. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు జంపింగ్‌లు చేసేశారు. మరీ ముఖ్యంగా కన్నడనాట ఎవరూ ఊహించని రీతిలో కాంగ్రెస్ గెలుపొందడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సీన్ మారిపోయింది. కర్ణాటకలో గెలవడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం వచ్చింది. దీంతో కార్యకర్తలు, నేతలు యమా జోష్‌లో ఉన్నారు. కర్ణాటక తర్వాత తెలంగాణలోనే ఎన్నికలు జరగబోతున్నాయ్. ఈ ఎన్నికల్లో ఎలాగైనా సరే కేసీఆర్‌ను గద్దె దించాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. అందుకే 2014, 2018 ఎన్నికల సమయంలో పార్టీ మారిన కాంగ్రెస్ నేతలందర్నీ తిరిగి సొంత గూటికి తీసుకొచ్చే పనిలో పడ్డారు. ఈ క్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి శుక్రవారం నాడు గాంధీ భవన్ వేదికగా శశిధర్ రెడ్డి.. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మాణిక్ ఠాగూర్, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిల సమక్షంలో కండువా కప్పుకున్నారు. ఈయనతో పాటు సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కీలక నేత డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ మట్టా రాగమయి కాంగ్రెస్‌లో చేరారు. కొందరు కీలక నేతలు బీఆర్ఎస్, నుంచి బయటికొచ్చేసి తిరిగి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

# భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఘనవిజయానికి ప్రతీక నూతన సన్సద్ భవన్!

## – వైయస్సార్సీపి రాజ్యసభ ఫ్లోర్ లీడర్ వి. విజయసాయిరెడ్డి

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):భారత పార్లమెంటు నూతన భవనం మే 28న ప్రారంభమవుతోంది. 1927లో నిర్మించిన ప్రస్తుత సన్సద్ భవన్ కు సమీపంలోని సెంట్రల్ విస్తాలో నిర్మించిన కొత్త భవనంలో పార్లమెంటు ఉభయసభలు రాజ్యసభ, లోక్ సభ కార్యకలాపాలు ఇక కొనసాగుతాయి. ఈ సందర్భంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు భవనాల చరిత్ర క్లుప్తంగా తెలుసుకుందాం. ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు పుట్టినిల్లుగా ఇంగ్లండ్ ను పరిగణిస్తారు. అయితే, బ్రిటిష్ పార్లమెంటును పొరపాటున ఇప్పటికీ చాలా మంది ప్రపంచంలోని పార్లమెంట్లకు మాతృక అని భావిస్తారు. అసలు విషయం ఏమంటే?ప్రఖ్యాత బ్రిటిష్ రాజకీయవేత్త, సంస్కర్త జాన్ బ్రయిట్ 1865 జనవరి 18న బర్మింగ్ హామ్ నగరంలో ప్రసంగిస్తూ ఇంగ్లండ్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 'ఇంగ్లండ్ ఈజ్ ద మదర్ ఆఫ్ పార్లమెంట్స్' అని అభివర్ణించారు. ప్రాతినిధ్య పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకుని, ఆచరణలో అనుసరిస్తున్న అన్ని దేశాలకు మోడల్ ఇంగ్లండ్ అనే అర్థంలో జాన్ బ్రయిట్ అలా మాట్లాడారు. కాని, యునైటెడ్ కింగ్ డమ్ రాజధాని లండన్ లోని వెస్ట్ మినిస్టర్ అబి ప్రాంతంలో ఉన్న బ్రిటిష్ పార్లమెంటు భవనాన్ని (అంటే అందులో సమావేశమవుతూ పనిచేసే పార్లమెంటు ఉభయ సభలు?హౌస్ ఆఫ కామన్స్, హౌస్ ఆఫ్ లార్డ్స్) అన్ని దేశాల పార్లమెంట్లకు మాతృక అనే భావనతో కొందరు బ్రయిట్ అన్న మాటలను వాడుతుంటారు. ఈ సందర్భంగా బ్రిటిష్ పార్లమెంటు చరిత్రను ఒకసారి గుర్తుచేసుకుందాం. 1707?1800 మధ్య లండన్ లోని ఈ పార్లమెంటు గ్రేట్ బ్రిటన్ పార్లమెంటుగా పనిచేసింది. 1801 జనవరి 1 నుంచి పార్లమెంట్ ఆఫ్ యునైటెడ్ కింగ్ డమ్‌గా నడుస్తోంది. వెస్ట్ మినిస్టర్ అబీ ప్రాంతంలో ఉన్న భవనాల్లో బ్రిటిష్ పార్లమెంటు ఉభయసభలు సమావేశమవుతుండడం వల్ల బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థను వెస్ట్ మినిస్టర్ మోడల్ అని కూడా పిలుస్తారు. గతంలో రెండుసార్లు అగ్నిప్రమాదాల్లో పార్లమెంటు భవనాలు ధ్వంసం కావడం, మళ్లీ నిర్మించడం జరిగింది. లండన్ థేమ్స్ (టెమ్జ్) నది తీరాన ఉన్న పార్లమెంటు భవనాలను ఇప్పుడు మళ్లీ ఆధునికీకరించే పనిచేపడుతున్నారు. 2025లో ప్రారంభమయ్యే నవీకరణ ఆరేళ్ల పాటు సాగుతుందని అంచనా. మారిన పరిస్థితులు, సాంకేతికత, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా భారత పార్లమెంటు ఉభయ సభలకు కొత్త భవనం అవసరం ఏర్పడింది. 1927లో నిర్మాణం పూర్తయి నాటి ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కార్యకలాపాలతో ప్రారంభమైన ప్రస్తుత సన్సద్ భవన్ ను అలాగే ఉంచి దగ్గర్లో కొత్త పార్లమెంటు భవనం నిర్మించడం, ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా కొత్త సన్సద్ భవన్ ప్రారంభించడం నేడు చర్చనీయాంశాలయ్యాయి. భారత రాజ్యాంగ రచనకు వేదికగా ఉపకరించిన పార్లమెంటు భవనంలో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత పార్లమెంటు ఉభయసభల నిర్వహణకు వీలు కల్పించారు. 1952 ఎన్నికల తర్వాత ఇప్పటి వరకూ 15 మంది ప్రధానమంత్రులు (రెండుసార్లు 13 రోజులు చొప్పున ప్రధానిగా ఉన్న జీఎల్ నందాతో కలిపి), 15 మంది రాష్ట్రపతులు ఈ పార్లమెంటు భవనంలో తమ విధుల్లో భాగంగా ప్రసంగించారు. 14 మంది ఉపరాష్ట్రపతులు (సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి జగదీప్ ధన్‌ఖడ్ వరకూ) రాజ్యసభ అధ్యక్షుల హోదాలో ఎగువసభ సమావేశాలు నిర్వహించారు. అలాగే, 17 మంది స్పీకర్ల (జీవీ మావలంకర్ నుంచి ఓం బిర్లా వరకూ) ఆధ్వర్యంలో లోక్ సభ సమావేశాలను ఈ భవనంలోనే జరిపించారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న పాత సన్సద్ భవన్ నుంచి ఇక ఉభయ సభల సమావేశాలు, కార్యకలాపాలు కొత్త భవనంలోకి మారడం నిజంగా 21వ శతాబ్దం మొదటి పాతికేళ్లలో గొప్ప పరిణామం. భారత రాజ్యాంగం 73 ఏళ్ల క్రితం అమలులోకి వచ్చినప్పుడు అనేక మంది ఇతర దేశాల మేధావుల వ్యతిరేక అంచనాలకు భిన్నంగా ఇండియాలో ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాలపరీక్షను తట్టుకుని నిలిచింది. విజయవంతమైంది. ఈ విజయానికి నూతన సన్సద్ భవన్ ప్రతీకగా నిలుస్తుంది.

# ఉమ్మడి పాలమూరు కేసీఆర్ వెంటే.. 14 స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే : మంత్రి హరీశ్‌రావు



మహబూబ్‌నగర్, మే27:తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లా.. పచ్చని పంటలతో కళకళలాడుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. కరువును తరిమికొట్టి.. వలసలను వాపస్ తీసుకొచ్చిన కేసీఆర్ వెంటే ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14కు 14 స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే అని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

జడ్చర్ల మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. 2018లో లక్ష్మారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని, కరోనా వల్ల కొంత ఆలస్యమైందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు సకల సౌకర్యాలతో ఈ ఆస్పత్రిని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డికి అబద్దాలు చెప్పడం అలవాటై పోయిందన్నారు. మహబూబ్‌నగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చిన ఘనత లక్ష్మారెడ్డిదే అని పేర్కొన్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు.

గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకోబోతున్నామని తెలిపారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కరువు లేదు. వలసలు ఆగిపోయాయి. ఆకలి చావులు లేవు అని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కృషితో పాలమూరు పచ్చని పైరుతో కళకళలాడుతోందన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రకృతి వైపరీత్యంతో సమానం అని విమర్శించారు. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం.. ఇష్టపడి అభివృద్ధి చేసుకున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనకుంటే.. ఈ రాష్ట్ర ప్రజలను అవమానించినట్లేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉద్యమంలో కలిసి రాలేదు.. ఇప్పుడు అభివృద్ధిలో కూడా కలిసి రావడం లేదని ధ్వజమెత్తారు.

# 'రాజదండం' వ్యవహారంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం

న్యూఢిల్లీ మే 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవం వేళ ఒక్కసారిగా తెరపైకి వచ్చిన 'రాజదండం' వ్యవహారం మరోసారి కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. అధికార మార్పిడికి రాజదండం ప్రతీక అని, బ్రిటిషర్లు దేశాన్ని విడిచిపెడుతూ అధికార మార్పిడికి సంకేతంగా రాజదండం ఇచ్చివెళ్లారని బీజేపీ చెబుతుండగా, అదంతా బోగస్ అని, అందుకు సంబంధించిన లిఖితపూర్వకమైన ఆధారాలేవీ కాంగ్రెస్ తాజాగా విమర్శించింది. దీనిపై బీజేపీ భగ్గుమంది.

భారతీయ సంస్కృతి, సంప్రదాయలను ఇంతగా ఎందుకు ద్వేషిస్తోందని కేంద్ర హోం మంత్రి వరుస ట్వీట్లలో ఆ పార్టీపై మండిపడ్డారు. "భారతదేశ విముక్తికి సంకేతంగా తమిళనాడుకు చెందిన శైవమఠం స్వామీజీల నుంచి పవిత్రమైన రాజదండాన్ని పండిట్ నెహ్రూ స్వీకరించారు. కానీ దానిని ఒక వాకింగ్ స్టిక్‌లాగే మ్యూజియంలో పెట్టేశారు. ఇది మరో సిగ్గుమాలిన చర్య" అని అమిత్‌షా విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో తిరువాడుతురై మఠం కూడా సింగోల్ ప్రాముఖ్యాన్ని వెల్లడించిందని, ఇదంతా బోగస్ అని కాంగ్రెస్ ఇప్పుడు అంటోదని అన్నారు. కాంగ్రెస్ తన ప్రవర్తన గురించి పునరాలోలించుకోవాలని అమిత్‌షా ఘాటు వ్యాఖ్యలు చేశారు.

దీనికి ముందు, కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ మాట్లాడుతూ, తమిళనాడులో రాజకీయ ప్రయోజనాల కోసం రాజదండాన్ని మోదీ, ఆయన భజన బృందం ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. అధికార బదిలీకి రాజదండం ప్రతీక అని మౌంట్‌బాటన్, రాజాజీ, నెహ్రూ చెప్పినట్టు లిఖితపూర్వక సాక్ష్యాలు ఏవీ లేవన్నారు. ఇదంతా ఓ బోగస్ అని కొట్టివేశారు. కొత్త పార్లమెంటులోని లోక్‌సభ స్పీకర్ వేదక సమీపంలో ఈనెల రాజదండం కొలువు తీరుతోంది.

# శాంతిభద్రతల పరిరక్షణ కోసం..సమూల మార్పులు.. ఎస్పీ పరమేశ్వర రెడ్డి



తిరుపతి, మే27:పరిపాలనా సౌలభ్యం, శాంతి భద్రతల పరిరక్షణ కొరకు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా తిరుపతి పోలీసు జిల్లాలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తెలియజేశారు. ఈ మార్పులను ప్రజలు గమనించి పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన భారీ మార్పులను వివరించారు. తిరుపతి వెస్ట్ సబ్ డివిజన్‌ను చంద్రగిరి సబ్ డివిజన్‌గా పేరు,పరిధిని మార్పులు చేశామన్నారు. కొత్తగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్‌లోకి 7 పోలీస్ స్టేషన్లను వస్తాయన్నారు. తిరుపతి రూరల్ (ముత్యాలరెడ్డి పల్లి), తిరుచానూరు, చంద్రగిరి, రామచంద్రపురం, పాకాల, యర్రవారి పాలెం, భాకరా పేట పోలీస్ స్టేషన్‌లను చేర్చినట్లు ఎస్పీ వెల్లడిరచారు. గతంలో తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్‌లోని తిరుచానూరు పోలీస్ స్టేషన్‌ను క్రొత్తగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్‌లోకి చేర్చారు.

ఇదివరకు ఉన్న ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్‌ను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌గా మార్పు చేశారు. కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్‌లోకి 4 పోలీస్ స్టేషన్లను వస్తాయని ఎస్పీ తెలిపారు. తిరుపతి ఈస్ట్, అలిపిరి, వెస్ట్, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లను చేర్చారు. గతంలో తిరుపతి వెస్ట్ సబ్ డివిజన్‌లో ఉన్న తిరుపతి వెస్ట్, ఎస్.వి యూనివర్సిటి పోలీస్ స్టేషన్‌లను ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన తిరుపతి సబ్ డివిజన్‌లోకి చేర్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్‌ను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌గా పేరు మార్పు చేశారు. అంతేకాకుండా ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంతకు ముందు ఉన్న 15 గ్రామ పంచాయతీలైన గాంధీపురం, చిగురువాడ, దుర్గసముద్రం, మల్లంగుంట, రామానుజపల్లి, సి.గొల్లపల్లి, పైడిపల్లి, పాతకాల్వ, పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, చెర్లోపల్లి, వెంకటపతి నగర్, పుదిపట్ల, పేరూరు, తుమ్మలగుంటలను యధావిధిగా తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కొనసాగుతాయన్నారు. ఇది వరకు తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అవిలాల, లింగేశ్వర్ నగర్, సాయి నగర్, ఓటేరు, శ్రీనివాసపురం గ్రామ పంచాయతీలను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ నుండి శ్రీనివాస కళ్యాణ మండపం వరకు, శ్రీనివాస కళ్యాణ మండపం నుండి సింధు ఫ్లై ఓవర్ జంక్షన్ వరకు, సింధు ఫ్లై ఓవర్ జంక్షన్ నుండి ఆర్‌సీ పురం జంక్షన్ వరకు, ఆర్‌సీ పురం జంక్షన్ నుండి ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ వరకు ఉన్న ఈ నాలుగు ప్రధాన మార్గాల మధ్య ఉన్న ప్రాంతాలనన్నింటినీ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు.

ఇది వరకు ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తిరుపతి, మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ 15, 14వ డివిజన్‌లో కొంత భాగాన్ని అన్నమయ్య సర్కిల్ నుండి ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ వరకు హద్దులు నిర్ణయించారు. తూర్పు బాగంలో ఉన్న బైరాగిపట్టెడ, ఇతర ప్రాంతాలు, ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్ నుండి, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజీ జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు ఉత్తరం వైపు ఉన్న ప్రాంతాలను ఒక పరిధిలోకి తీసుకొచ్చారు. ఇది వరకు తిరుచానూరు పరిధిలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని శ్రీనివాస కళ్యాణమండపం నుండి వివేకానంద విగ్రహం, రాఘవేంద్ర నగర్ 5వ క్రాస్ నుండి కేశవాయనగుంట మెయిన్ రోడ్డు మధ్యలో ఉన్న భాగమంతా తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చినట్లు వివరించారు. కొరమీను గుంట ప్రాంతం ఇదివరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వుండేది. ప్రస్తుతం ఈ ఏరియా పూర్తిగా అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్పు చేశారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏరియాలు ఆర్.కె. డీలక్స్ జంక్షన్ నుండి గరుడ సర్కిల్ వరకు, స్విమ్స్, రుయా, బర్డ్, ఆయుర్వేదిక్ కాలేజీ, సంబందిత స్టాఫ్ క్వార్టర్స్, గరుడ సర్కిల్ నుండి జూ పార్క్ రోడ్, వేదిక్ యునివర్సిటి, సైన్స్ సెంటర్, అరవింద్ ఐ ఆసుపత్రి, టాటా కాన్సర్ హాస్పిటల్, భారతీయ విద్యా భవన్‌ను వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్పు చేశారు. ముత్యాలరెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లు 19, 20, 22వ డివిజన్‌లో కొంత భాగమైన అన్నమయ్య సర్కిల్ నుండి అవిలాల జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు పడమరగా ఉన్న ప్రాంతాలను, అవిలాల జంక్షన్ నుండి వైకుంఠపురం, తెలుగు తల్లి విగ్రహం, చాముండేశ్వరి గుడి వరకు ఉత్తరం వైపుగా గల ప్రాంతాలు ఎల్.ఎస్. నగర్‌ను యస్.వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంతకు ముందున్న 9 గ్రామ పంచాయతీలైన తిరుచానూరు, పద్మావతి పురం, వేదాంతపురం, కేసి పేట, తనపల్లి, పాడి పేట, ముండ్లపూడి, బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో యధావిధిగా కొనసాగుతాయి. ఇది వరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళం క్వార్టర్స్, రణధీర్ పురం, సప్తగిరి నగర్, బిటిఆర్ పురం, శెట్టిపల్లి పంచాయతీలోని మంగళం, మిట్ట గాంధీ పురం, చెన్నాయగుంట గ్రామాలను తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. పోలీస్ సంబంధిత సేవల కొరకు ప్రజలు పైన తెలిపిన పోలీస్ స్టేషన్‌ల పరిధులలో మార్పులను గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు కులశేఖర్ శాంతి భద్రత, డిఎస్పిలు సురేంద్ర రెడ్డి, యశ్వంత్, సిఐలు సురేంద్ర రెడ్డి, రవీంద్రనాథ్, సుబ్రమణ్యం రెడ్డి, అబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాలకి చిరునామా టీడీపీ.. చంద్రబాబు



అమరావతి, మే27:ఎన్టీఆర్ శతజయంతి వేడుకలని ఘనంగా నిర్వహించామన్నారు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు. ఎన్టీఆర్ వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్నారు. రాజమండ్రిలో జరుగుతున్న టీడీపీ మహానాడులో ఆయన మాట్లాడారు. టీడీపీలో మరింత జోష్ పెరిగిందన్నారు. సహకరిస్తే సరే.. అడొస్తే తొక్కుకుంటూపోతామన్నారు చంద్రబాబు. కార్యకర్తల త్యాగాలను తాను మరచిపోనని చెప్పారు. ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకి తాను అండగా ఉంటామన్నారు. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ అన్నారు. సంపద పేదలకి పంచడం తెలిసిన పార్టీ టీడీపీ అని తెలిపారు చంద్రబాబునాయుడు. సంక్షేమ కార్యక్రమాలకి చిరునామా టీడీపీ అన్నారు. తిరిగి రాష్ట్రాన్ని కాపాడటానికి ఒక సంకల్పం తీసుకుంటామన్నారు. టీడీపీ జెండాని చూస్తే ఎక్కడలేని ఉత్సాహం వస్తుందన్నారు.

# తిరుపతిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు.. చిన్నశేష వాహనంపై గోవిందుడు దర్శనం



తిరుపతిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..చిన్నశేష వాహనంపై గోవిందుడు దర్శనంతిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ గోవిందరాజస్వామి చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తులు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. మంగళవాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనలు, స్వామివారి వాహనసేవ వైభవంగా కొనసాగింది.

చిన్నశేష వాహనంపై స్వామివారి పాంచభౌతికప్రకృతికి సంకేతమని అర్చకులు వివరించారు. ఐదు తలల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయప్రదమని పేర్కొన్నారు. శేషవాహనోత్సవాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలాలు తొలగి, భక్తులు కుండలినీయోగ సిద్ధించి, సుఖశాంతులతో ఆనందజీవులతారని వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనంనిర్వహించారు.

# రైతాంగం గురించి ఆలోచించేది తెలంగాణ ప్రభుత్వమే.. : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే27: రైతాంగం గురించి ఆలోచించేది తెలంగాణ ప్రభుత్వమేనని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్,




జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు పంటల సాగును ముందుకు తీసుకువచ్చేందుకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతాంగాన్ని కాపాడుకునేందుకు సీఎం సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. మే మాసాంతానికి మొదటి పంట, నవంబర్ చివరికి రెండో పంట నాట్లు పూర్తికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దాంతో మార్చి చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయన్నారు. ఈ మేరకు జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టగా.. సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం సభలో పలువురు ప్రజాప్రతినిదులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై స్పందించగా మంత్రి మాట్లాడుతూ.. తుఫాన్‌కు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగా అని స్పష్టం చేశారు. ఈ తరహాలో భారతదేశంలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన మరో రాష్ట్రం ఎక్కడా లేదన్నారు. ఈ సందర్భంగా అధికారులను మంత్రి అభినందించారు.

విధానాలను అమలు పరిచే బాధ్యత వరకు శాసనకర్తలకు పరిమితమని, అమలు పరిచే బాధ్యత ఖచ్చితంగా అధికారులపై ఉంటుందన్నారు. అక్కడక్కడా చిన్నచిన్న పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు సూచనలు చేయాలని, రాద్ధాంతం చేస్తే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. యావత్ దేశంలోనే తొలిసారిగా కల్లాల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రతీ మీడియా హౌస్‌కు ఓ ఎజెండా ఉంటుందని, జరుగుతున్న దాన్ని జరగలేదని చెప్పేందుకు ఆ మీడియా హౌస్‌లు పోటీపడుతున్నాయని విమర్శించారు. ఇన్నేళ్ల నుంచి రైతాంగం గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆయన.. ఎవరీ ఎజెండాలను ఉటంకించాల్సిన అవసరం లేదన్నారు. అలాంటి ట్రాప్‌లో ఏ ఒక్కరూ పడొద్దని ప్రజాప్రతినిధులకు సూచించారు.

# రేవంత్‌రెడ్డిపై మండిపడ్డ బీఆర్ఎస్ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మే27:టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ఒక బ్రోకర్, బ్లాక్‌మెయిలర్ అని విరుచుకుపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఏర్పాటు చేసిన 100 పడకల ఆస్పత్రిని మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జడ్చర్లలో 100 పడకల ఆస్పత్రి నిర్మించుకోవడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ ఆస్పత్రిలో అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల అద్దంలా మెరిసిపోతుందని అన్నారు. ఈ అభివృద్ధిని చూసి కొంతమంది మూర్ఖులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా విలువను రేవంత్ రెడ్డి తగ్గిస్తున్నాడని సీరియస్ అయ్యాడు. రేవంత్ నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలేనని అన్నారు. రాజకీయాలను ఆయన భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. అసలు మిడ్జిల్‌కు ఏం చేశాడో రేవంత్ రెడ్డి చెప్పాలని నిలదీశారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి : మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, మే27: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులపై ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. దీంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కూడా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండలం కొడకండ్ల, ఏడునూతుల గ్రామంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతున్నదని వెల్లడించారు.

రైతులకు ఇస్తున్న ఉచిత 24 గంటల విద్యుత్ వల్ల ప్రతి ఏటా రైతుల తరపున రూ. 10,500 కోట్లను విద్యుత్ సంస్థకు చెల్లిస్తున్నారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా అడ్డు పడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని సూచించారు. మహిళా సాధికారత దిశగా ఉచిత కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ అందజేస్తూ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువకుల కోసం కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు.

నియోజకవర్గంలోని ఒక్కో మండలాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేశానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్న సమయంలో అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రజలు కూడా ఆయా పనులను విశ్లేషించుకుని, సీఎం కేసీఆర్ అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు.

# కర్ణాటకలో మంత్రులకు శాఖల కేటాయింపు.. సిద్ధూ దగ్గరే ఆర్థిక శాఖ.. డీకేకు నీటి పారుదల శాఖ

బెంగళూరు, మే27: కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు ఇతర మంత్రులందరికీ శాఖలను కేటాయించారు. మొత్తం 34 మంది మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయ్యింది. అందులో ముఖ్యమంత్రి తోపాటు, ఉప ముఖ్యమంత్రి, 32 మంది ఇతర మంత్రులు ఉన్నారు. అయితే, సీఎం సిద్ధూ ఆర్థిక శాఖను మాత్రం తన దగ్గరే అట్టిపెట్టుకున్నారు. ఆర్థిక శాఖతోపాటు వ్యక్తిగత, పరిపాలనా సంస్కరణల శాఖ, ఇంటెలిజెన్స్ శాఖ, సమాచార శాఖ, ఎవరికీ కేటాయించని ఇతర చిన్నచిన్న శాఖలు ఆయన దగ్గర ఉన్నాయి.

ఇక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖలను కేటాయించారు. దాంతోపాటు బెంగళూరు నగర అభివృద్ధి శాఖను కూడా డీకేకు కట్టబెట్టారు. ఇక సీనియర్ నేతలు జీ పరమేశ్వరకు హోంశాఖ (ఇంటెలిజెన్స్ మినహా), హెచ్‌కే పాటిల్‌కు న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, దినేశ్ గుండూరావుకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, కృష్ణ బైరె గౌడకు రెవెన్యూ శాఖ, ఎన్ చలువనారా యణస్వామికి వ్యవసాయ శాఖ, కేజే జార్జ్‌కు విద్యుత్ శాఖ, కేహెచ్ మునియప్పకు ఆహార, పౌరసరఫరాల శాఖ, ఎంబీ పాటిల్‌కు పరిశ్రమల శాఖను, రామలింగప్ప రెడ్డికి రవాణా శాఖ, ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ, బీ నాగేంద్రకు యువజన వ్యవహారాలు, క్రీడా శాఖలను కేటాయించారు.

# నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోడీకి ఊహించని షాక్

## -ఈ సదస్సుకు తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విదేశాల్లో కాలు పెడుతున్న చోట.. ఆయనకు ఘన స్వాగతం లభిస్తున్న సంగతి తెలిసిందే. కొందరు దేశాధినేతలు ఆయనతో భేటీకి పరమానందభరితులైపోతున్నారు. ఇక.. ఆయన పాల్గొనే కార్యక్రమాలకు పాసుల కోసం భారీ డిమాండ్ ఏర్పడటం ఒక ఎత్తు అయితే.. ఆయన్ను కలిపించే అవకాశం కల్పించాలని అమెరికా.. ఆస్ట్రేలియా దేశాధ్యక్షులకు భారీ ఎత్తున వినతులు వస్తున్న విషయం తెలిసిందే. విదేశాల్లో మోడీ ప్రభ అంతకంతకూ వెలిగిపోతున్న వేళ.. అందుకు భిన్నమైన వాతావరణం దేశీయంగా చోటు చేసుకుంది.తన తాజా విదేశీ పర్యటనను సూపర్ సక్సెస్ చేసుకొని దేశానికి వచ్చిన ప్రధానికి తాజాగా ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ భేటీ ఆయనకు ఊహించని షాక్ ను ఇచ్చింది. ఈ సదస్సుకు తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు కావటం సంచలనంగా మారింది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి.. పాలక మండలి సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. లెఫ్టినెంట్ గవర్నర్లు.. కేంద్ర మంత్రులు హాజరు కాగా.. తొమ్మిది రాష్ట్రాల సీఎంలు గైర్హాజరు కావటం గమనార్హం.

హాజరుకానిముఖ్యమంత్రుల్లో..-




తెలంగాణ- ఢిల్లీ- పంజాబ్- పశ్చిమ బెంగాల్- బిహార్- తమిళనాడు- కేరళ- కర్ణాటక-రాజస్థాన్ ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల నేపథ్యంలో తాను సమావేశానికి హాజరు కావటం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొనగా.. అదే బాటలో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నడిచారు. కేసీఆర్ విషయానికి వస్తే.. ఆయన తాజాగా ప్రగతి భవన్ లో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కమ్ ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తో భేటీ అయ్యారు. ఈ భేటీకి అదే పార్టీకి చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఉన్నారు.ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసులు.. బదిలీల అంశంపై కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ నేపథ్యంలో సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లుగా ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొంటే.. నిధుల కేటాయింపు విషయంలో పంజాబ్ పై కేంద్రం వివక్ష చూపిస్తుందన్న ఆరోపణతో సమావేశానికి దూరంగా ఉండటం గమనార్హం. నీతి ఆయోగ్ సమావేశానికి తాను రాలేనని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తనకు బదులుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి.. చీఫ్ సెక్రటరీని పంపేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా కేంద్రం నో చెప్పింది.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రుల విషయానికి వస్తే.. అనారోగ్య కారణాలతో రావట్లేదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ పేర్కొంటే.. కర్ణాటకలో కేబినెట్ విస్తరణ కారణంగా రాలేకపోత ున్నట్లుగా సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉండటంతో రాలేకపోతే.. కేరళ సీఎం పినరయి విజయన్ మాత్రం భేటీకి రాలేకపోతున్నట్లు చెప్పినా.. కారణం మాత్రం వెల్లడించలేదు.

# నల్లగొండ అభివృద్ధిపై చర్చకు సిద్ధం : ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ , మే27: నల్లగొండ నియోజక వర్గంలో ఇప్పటివరకు రూ. 1300 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో చర్చకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. గురువారం నల్లగొండ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఐటీ హబ్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

చేసిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనబడటం లేదని విమర్శించారు. కోమటిరెడ్డి కి మతిస్థిమితం లేక పూటకో మాట, రోజుకో పార్టీ మారుతున్నారని ఆరోపించారు. కోమటిరెడ్డి బ్రదర్స్అభివృద్ధి నిరోధకులుగా మారారని పేర్కొన్నారు. అనవసర విషయాల్లో తనపై బురద జల్లుతున్నారని, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఐటీ మంత్రి కేటీఆర్, జిల్లా మంత్రి జగదీష్ రెడ్డిల సహకారంతో పట్టణంలో ఐటీ హబ్ మంజూరయిందని వెల్లడించారు. ప్రస్తుతం ఐటీ హబ్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తి కాగా మరో మూడు నెలల్లో ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే 16 కంపెనీలు నల్లగొండ ఐటీ హబ్ లో తమ బ్రాంచ్ లు నెలకొల్పుతామని ఒప్పందం చేసుకున్నాయని, దీని ద్వారా మొత్తం 3 వేల మంది యువత కు ఉపాధి లభిస్తుందని అన్నారు.

పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం కూడా పూర్తి కావొస్తున్నదని, మెడికల్ కాలేజీ కి ప్రొఫెసర్ లు, డీన్ లు, డాక్టర్ లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. జూన్ మొదటి వారంలో మంత్రి కేటీఆర్ 139 కోట్ల రూపాయలతో నల్లగొండ పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన లు చేయనున్నారని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు.

# H-1B వీసాపై విదేశీ హెల్త్ వర్కర్స్‌కు చాన్స్..

## -బిల్లును ప్రవేశ పెట్టిన కాంగ్రెస్

న్యూ డిల్లీ మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అగ్రరాజ్యం అమెరికాలో హెచ్-1 బీ వీసా విషయంలో ఇటీవల కాలంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హెచ్-1బీ వీసాపై విదేశీ హెల్త్ వర్కర్స్కు అవకాశం కల్పించే బిల్లు చట్టసభకు చేరింది. ఇద్దరు యుఎస్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ బిల్లును బిల్లును ప్రవేశపెట్టారు. అయితే.. దేశంలో తగినంత మంది హెల్త్ వర్కర్లు లేనప్పుడు హెచ్1 బీ వీసా ద్వారా విదేశాల నుంచి రప్పించుకునే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ సభ్యురాలు రషీదా త్లైబ్ డాలియా రామిరేజ్ ప్రవేశపెట్టిన బిల్లుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వెటరన్స్ కోసం విస్తరించే ఆరోగ్య సంరక్షణ చట్టం ఊ1-ః వీసా హోల్డర్లుగా ఉన్న వలస ఆరోగ్య కార్యకర్తలను అనుమతించడం ద్వారా అమెరికాలో హెల్త్కేర్ ప్రొవైడర్ల కొరతను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఈ బిల్లు ఊ1-ః వీసా ప్రోగ్రామ్ ప్రయోజనాల కోసం డిపార్ట్మెంట్ ఆఫ్ వెటరన్స్ అఫైర్స్ స్టేట్ వెటరన్స్ హోమ్లను మినహాయింపు సంస్థలుగా నిర్దేశిస్తుంది."మన దేశంలో ఆరోగ్య కార్యకర్తల కొరతతో బాధపడుతున్న వారి పట్ల మా నిబద్ధతను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాకు ఉంది. మా కమ్యూనిటీలలోని వలసదారులతో మేము ఈ కొరతను పరిష్కరించగలం పనిచేయడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారు. కానీ వీసా కారణంగా చాలా అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. " అని వెటరన్స్ వ్యవహారాలపై హౌస్ కమిటీ సభ్యురాలు కాంగ్రెస్ సభ్యురాలు రామిరేజ్ అన్నారు.మరో ప్రజా ప్రతినిధి త్లైబ్ జోక్యంతో ఈ బిల్లు రూపొందించినట్టు కాంగ్రెస్ ఉమెన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. "మా అనుభవజ్ఞులు అధిక-నాణ్యత గల ఆరోగ్య సంరక్షణకు అర్హులు. మా జిల్లాకు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం అనుభవజ్ఞులు చాలా అవసరం" అని కాంగ్రెస్ మహిళ త్లైబ్ అన్నారు."మా అనుభవజ్ఞుల కోసం ఆరోగ్య సంరక్షణ ప్రదాతలను విస్తరించడానికి ఈ చట్టాన్ని పరిచయం చేస్తున్నందుకు నేను గర్వపడుతున్నాను వలస వచ్చిన వారి సంరక్షణ కోసం ఆరోగ్య సంరక్షణ నిపుణులను స్వాగతించడం ద్వారా వారి సేవలు పొందే అవకాశం ఉంటుంది" అని ఆమె చెప్పారు. ఈ చట్టాన్ని ది వెటరన్స్ ఫర్ పీస్ సేవ్ అవర్ ఎం నేషనల్ ప్రాజెక్ట్ ది అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ ఆమోదించాయి.

# రైతుల ఆత్మహత్యలు జరిగింది చంద్రబాబు హయాంలోనే!

## -మండిపడ్డ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం మే 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుపై మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. వ్యవసాయం శుద్ధ దండగ అని చంద్రబాబు చెప్పారని.. రైతుల ఆత్మహత్యలు జరిగింది చంద్రబాబు హయాంలోనే మండిపడ్డారు. చంద్రబాబు పాలన అంతా కరువు, కాటకాలే అని బొత్స విమర్శించారు. రైతుకు భరోసా కల్పించి వ్యవసాయం వైపు నడిపించింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధి సూచీ టీడీపీ కంటే ఎక్కువ ఉందనే గణాంకాలు నిజమా.? కాదా..? అని చంద్రబాబు చెప్పాలన్నారు.రాజమండ్రిలో మహా డ్రామా జరుగుతుందని, ఎన్టీఆర్ చావుకు చంద్రబాబు కారణమని, ఎన్టీఆర్ ఆత్మ క్షోభించడానికి కారణం చంద్రబాబు అని ఆరోపించారు. మళ్లీ ఆయన ఫోటోకు చంద్రబాబు దండ వేస్తున్నారని, చంద్రబాబుకు చెప్పుకోనేందుకు ఒక పథకమైన ఉందా అని మంత్రి ప్రశ్నించారు. బాబు హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోలేదా?, వ్యవసాయం దండగని చెప్పింది చంద్రబాబు కాదా అని మంత్రి అన్నారు. చంద్రబాబు హయాంలో 22 స్థానంలో ఉన్న జీడీపీ నేడు మొదట స్థానంలో లేదా అని మంత్రి ప్రశ్నించారు.

విద్య, వైద్యం, వ్యవసాయం సంక్షేమంకు సీఎం జగన్ పెద్ద పీట వేశారని, వాస్తవాలు ప్రజలకు తెలుసని మంత్రి బొత్స అన్నారు. అధికారం ఇచ్చిన ఐదేళ్ల చంద్రబాబు దోచుకుతిన్నారని, చంద్రబాబు సామాజిక వర్గానికి దోచిపెట్టారని మంత్రి ఆరోపించారు.

# సమస్యల సత్వర పరిష్కారానికి వార్డు పాలన-మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్, మే27:మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సూచనల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో జూన్ 1వ తేదీ నుంచి వార్డు పరిపాలన చేపట్టేందుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సమస్యల సత్వర పరిషారానికి పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 150 వార్డులలో 10 మంది అధికారుల బృందంతో వార్డు పాలన వ్యవస్థ మొదలవుతుందన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.12 వార్డు నం.93 సిటీ మేనేజర్ ట్రైనింగ్ సెంటర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న వార్డు ఆఫీస్‌ను మేయర్ పరిశీలించారు. నగర పౌరులకు అతి సమీపంలో వార్డు ఆఫీస్‌లను ఏర్పాటు చేసి అందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వార్డు ఎంటమాలజిస్ట్, వార్డు ఇంజినీర్, వార్డు టౌన్ ప్లానర్, వార్డు కమ్యునిటీ ఆర్గనైజర్, వార్డు శానిటరీ జవాన్, వార్డు అర్బన్ బయోడైవర్సిటీ సూపర్ వైజర్, వార్డు కంప్యూటర్ ఆపరేటర్, వార్డు రిసెప్షనిస్ట్, జలమండలి అధికారులు, టీఎస్ ఎస్పీడీసీఎల్ అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ నెల 25, 26 తేదీలలో వార్డు ఆఫీస్‌లను సకల సదుపాయాలతో సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

ఈ నెల 31న వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి పౌరులకు వార్డు సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ 'మై జీహెచ్ఎంసీ' యాప్ ద్వారా పౌర సమస్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి పౌరుల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిషరించడానికి వార్డు ఆఫీస్‌లు పనిచేయనున్నాయని తెలిపారు. వార్డు కార్యాలయం పేర్లను తెలిపే బోర్డులను ప్రజలందరికీ కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. వార్డు కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు ఒకే దగ్గర పని చేయనున్నారు. జూబ్లీహిల్స్ సరిల్‌లో నాలుగు వార్డులను ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో వార్డు నం.92 వెంకటేశ్వర కాలనీలో, వార్డు నం.94 షేక్ పేట్, వార్డు నం.95 జూబ్లీహిల్స్ లో ఏర్పాటు చేస్తున్నారని మేయర్ తెలిపారు.

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వార్డు కార్యాలయాల ఆఫీసర్లకు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు శిక్షణ గురువారం ఇవ్వనున్నారు. పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్‌ల సమక్షంలో ఈ శిక్షణ తరగతులను ప్రధాన కార్యాలయంలో ఏడవ అంతస్తులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పౌరులు అందించిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం మార్గాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు.

# తెలంగాణ పథకాలను దేశమంతా అమలు చేయాలి



హైదరాబాద్, మే27: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షకు మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు హాజరై మద్దతు పలికారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. దేశంలో పేదరికం పోవాలంటే యువత బాగుపడాలని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ కృషితో నేడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్టీఐ పట్ల అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ సూచించారు. ఈ దీక్షలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యతిరాజులు, సమాచార హక్కు పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ కుమారి కన్నెబోయిన ఉషారాణి, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, ఎన్‌హెచ్‌పీఎన్ జాతీయ కో-ఆర్డినేటర్ గాదం ఉత్తరయ్య, జలసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, సాయంత్రం కేశవులుకు మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

# పాక్‌లో ఆత్మాహుతి దాడి.. ఇద్దరు మృతి..

న్యూఢిల్లీ, మే27 పాక్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో భద్రతా బలగాల కాన్వాయ్‌ను లక్ష్యంగా శనివారం ఆత్మాహుతి బాంబర్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 19 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ నుంచి దక్షిణ వజీరిస్థాన్‌లోని అస్మాన్ మాంజా ప్రాంతానికి భద్రతా దళాల కాన్వాయ్ వెళ్తుండగా ఆత్మాహుతి బాంబర్ దాడికి పాల్పడ్డాడు. ఇద్దరు మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డట్లు అధికారులు పేర్కొన్నారు. దాడిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి. ఇదిలా ఉండగా.. గత బుధవారం ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని వజీరిస్తాన్‌లోని దత్తా ఖేల్ బజార్‌లోని భద్రతా తనిఖీ కేంద్రం లక్ష్యంగా ఆత్మాహుతి బాంబర్ దాడి చేయగా.. ఇద్దరు సైనికులతో సహా నలుగురు వ్యక్తులు మరణించారు.

# సత్వర పరిష్కారం చూపాలి-జలమండలి ఎండీ దానకిశోర్

హైదరాబాద్, మే27: గ్రేటర్‌లో తాగునీటి సరఫరాతో పాటు సీవరేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వార్డు అసిస్టెంట్లు పనిచేయాలని ఎండీ దానకిశోర్ సూచించారు. వివిధ వార్డుల్లో పనిచేయడానికి ఎంపిక చేసిన అసిస్టెంట్లకు శుక్రవారం జలమండలిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ దానకిశోర్ పాల్గొని ప్రసంగించారు. వార్డులో జలమండలి తరఫున సిబ్బంది పాటించాల్సిన విధి విధానాలు, చేయాల్సిన పనులు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు.

వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా వార్డు అసిస్టెంట్లు పనిచేయాలని ఎండీ దానకిశోర్ తెలిపారు. జలమండలి ఇప్పటికే కస్టమర్ కేర్ సెంటర్, ఆన్‌లైన్, ట్విట్టర్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

వీటికి తోడు ప్రజలు నేరుగా ఇచ్చే ఫిర్యాదులను సంబంధిత సెక్షన్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఫిర్యాదులను ఎంసీసీలో నమోదు చేసి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలన్నారు. వార్డు స్థాయిలో నమోదయ్యే తాగునీటి, సీవరేజీ సమస్యలపై క్షేత్రస్థాయిలో ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు.

వార్డు అసిస్టెంట్లకు సంబంధించి 8 అంశాలపై దృష్టి సారించనున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ ఫిర్యాదులను సంబంధిత మేనేజర్ దృష్టికి తీసుకువెళ్తారు. తర్వాత వాటిని ఫాలోఆప్ చేసుకోవాల్సి ఉంటుంది. మేనేజర్ నుంచి యాక్షన్ స్టేషన్ రిపోర్టు తీసుకోవాలి. ఆ రిపోర్టును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఫిర్యాదు పరిష్కారంపై సంబంధిత వినియోగదారులకు సమాచారం అందజేయాల్సి ఉంటుంది.

# సజావుగా టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్ష.. జూన్ 20న ఫలితాలు వెల్లడి

హైదరాబాద్, మే27: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన టీఎస్ ఐసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. ఐసెట్ ఫలితాలను జూన్ 20వ తేదీన విడుదల చేస్తాని కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి వెల్లడించారు. 26, 27 తేదీల్లో నాలుగు సెషన్లలో పరీక్షలను నిర్వహించగా 75,925 మంది విద్యార్థులకు గానూ 70,900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షల ప్రాథమిక కీని జూన్ 5న విడుదల చేస్తామని, జూన్ 6, 8 వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలు స్వీకరించి జూన్ 20న ఫలితాలు విడుదల చేస్తామని విజయలక్ష్మి తెలిపారు.

# పాలిసెట్ - 2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్‌కు చెందిన విద్యార్థినిల ప్రతిభ




రాజన్న సిరిసిల్ల, మే27:(నేటినిజం ప్రతినిధి): పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వేములవాడ పట్టణం లోనే కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కి చెందిన విద్యార్థిని అలంపల్లి దివిత 143× ర్యాంక్ మరియు గిరి వర్షిణి 2813 ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారు. పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ అమ్మాయిలకు స్టేట్ లెవెల్ 143 ర్యాంక్ రావడం ఎంతో అభినందనీయం అని ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలి అని కొనియాడారు. ప్రిన్సిపాల్ కళ్యాణ్ కుమార్ శాలువా మరియు పుష్పగుచ్చం తో అభినందించారు చదువు తో పాటు బయట ఉన్న పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ మాకు సహకరించిన ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# యాంటీ హ్యూమన్.. ట్రాఫికింగ్.. తెలంగాణలో వికారాబాద్ జిల్లా టాప్

హైదరాబాద్, మే27: తెలంగాణ రాష్ట్రంలోనే అగ్ర భాగంలో వికారాబాద్ జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నిలిచిందని జిల్లా ఎస్పీ కోటి రెడ్డి అన్నారు. విమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపి షికాగోయల్ చేతుల మీదుగా ఏహెచ్‌టియూ టీం వికారాబాద్ ఇన్స్పెక్టర్ వి. దాసు కు ప్రశంసా పత్రం దక్కింది. విమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 2022 సంవత్సరానికి గాను రాష్ట్రంలో ఉన్న 31 ఏహెచ్‌టియూ టీమ్ లలో వికారాబాద్ జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ టీమ్ తెలంగాణ రాష్ట్రంలోనే అగ్ర భాగంలో నిలిచింది.

వికారాబాద్ జిల్లా ఏహెచ్‌టియూ టీమ్ విధి నిర్వహణలో భాగంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. 18 సంవత్సరాల లోపు బాలబాలికలు జిల్లాలోని కర్మాగారలలో పని చేస్తున్న వారి గురించి సమాచారం సేకరించారు. ఆపరేషన్ స్మైల్ ఉ ముస్కాన్ ద్వారా గత సంవత్సరం లో సుమారు 316 మంది పిల్లలను కాపాడారు. వారికి చైల్డ్ వెల్ఫేర్ కమిటి ముందు ఇతర శాఖల సమన్వయంతో వారి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించారు. వారు మళ్ళీ బడికి వెళ్ళే విధంగా ప్రోత్సహించడం జరిగింది.

# అత్యవసర వైద్య సేవల్లో సెమి సేవలు ప్రశంసనీయం : మంత్రి తలసాని




హైదరాబాద్, మే27:రాష్ట్రంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రాధాన్యతపై అవగాహన పెంచడంలో సొసైటి ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా శనివారం నెక్లెస్ రోడ్‌లో మారథాన్ నిర్వహించారు.

సంజీవయ్య పార్కు సమీపంలో థ్రిల్ సిటీ వద్ద మారథాన్ 5కె, 10కె తో పాటు 10 కె సైకిలో థాన్ ను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి అత్యవసర వైద్యం, ఆరోగ్య సంరక్షణ కీలకమైన స్థానాన్ని కలిగి ఉందని అన్నారు.

అత్యవసర సమయాల్లో అత్యంత నైపుణ్యం, అంకితభావం, నిపుణులైన వైద్యులు అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

సెమి వైద్య సేవల్ని ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తుండడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సెమి తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 'జీవితాన్ని కాపాడడంలో ప్రతి సెకను ముఖ్యం' అని, ఇది ఆసుపత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బందికే కాకుండా సాధారణ పౌరులందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స అందించడం, కార్డియాక్ అరెస్ట్‌లో ఉన్న వారికి ప్రాథమిక వైద్య సహాయాన్ని అందించడం వారిని సమీప ఆసుపత్రికి తరలించడంలో సహాయం చేయడం ప్రతి పౌరుడు విధిగా భావించాలని కోరారు.

సెమి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరవణ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్ వర్మ, శ్రీని ఇన్ ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్, హైదరాబాద్ రన్నర్స్ క్లబ్, ఈసీఐఎల్ రన్నర్స్ క్లబ్ తో పాటు సెమి నేషనల్ గవర్నెన్స్ చైర్ పర్సన్ డాక్టర్ ఇమ్రాన్, కోశాధికారి సౌజన్య, సెమి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి, ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు క్రీడా దుస్తుల పంపిణీ..



రాజన్న సిరిసిల్ల, మే27:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం అనంత పల్లి గ్రామంలో క్రీడాకారులకు గ్రామానికి చెందిన జువ్వాడి వెంకటేశ్వర్ రావు శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు, అలాగే క్రీడాకారులకు క్రికెట్ కిట్టును కూడా అందజేశారు, ఈ కార్యక్రమంలో నాయకులు మెరుపుల పర్శరాములు గౌడ్, శ్రీ వర్ధన్ మహేష్ సాగర్ వంశీ నవీన్ ప్రణయ్ కిరణ్ వేణు శ్రీకర్ రాజబాబు శ్రీనివాస్ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు, జువ్వాడి వెంకటేశ్వరరావు కు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

# మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి.. గవర్నర్‌కు మైనార్టీ మోర్చా వినతి

అమరావతి, మే27: ఏపీలో మైనార్టీల సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ కు బీజేపీ మైనార్టీ మోర్చా వినతి పత్రం అందించింది. ఇవ్వాల (శనివారం) ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ షఫీ ఉల్లా ఆధ్వర్యంలో రాజ్ భవన్ లో గవర్నర్ ను కలిసి సమస్యలను విన్నవించారు. గత ప్రభుత్వం విదేశీ విద్య పేరుతో ఎంపిక కోసం ఇచ్చిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని, అదేవిధంగా దుల్హన్ స్కీమ్ నిర్వీర్యం చేశారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మార్కెట్‌లోకి విజయ బ్రాండ్ పల్లీ నూనె.. విడుదల చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, మే27:విజయ బ్రాండ్ పల్లీ నూనెను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచెర్ల రామకృష్ణారెడ్డి, ఎండి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. కల్తీ లేని ఉత్పత్తులు ఉత్పత్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విజయ బ్రాండ్ నుంచి నాణ్యమైన వంట నూనెలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఉత్పత్తులు ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. నాణ్యమైన వంట నూనెల తయారీపై ఆయిల్ ఫెడ్ దృష్టి పెట్టిందన్నారు. వేరుశెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కొబ్బరి, రైస్ బ్రాన్, పామాయిల్, గానుగ నూనెలను ఆయిల్ ఫెడ్ ఉత్పత్తి చేస్తుందని పేర్కొన్నారు. విజయ బ్రాండ్ ఉత్పత్తులను అందరూ ఆదరించాలని కోరారు. శుద్ధమయిన ఆహారాన్ని ఎంపిక చేసుకునే అవకాశం మన చేతుల్లోనే ఉందన్నారు.

**అన్ని రైతు బజార్లలో విజయ ఔట్‌లెట్లు..**

హైదరాబాద్ నగరంలోని అన్ని



రైతుబజార్లలో విజయ ఔట్ లెట్లు ఏర్పాట్లు చేస్తామని మంత్రి నిరంజన్ రెడ్డి ప్రకటించారు. మొత్తం 33 జిల్లాకేంద్రాలలో ఔట్ లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఔట్ లెట్లు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. సిద్దిపేట, వనపర్తి జిల్లాలో వచ్చే జూన్ నెలలో ప్రారంభిస్తామన్నారు.

# సాధారణ జీర్ణ సమస్యలను నివారించడానికి పిల్లల పేగులు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులను కోరుతున్న శిశువైద్యులు



హైదరాబాద్, మే27: ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం మనందరికీ మన పేగులు ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఒక సున్నితమైన రిమైండర్‌గా వస్తుంది. సాధారణ జీర్ణ సమస్యలను నివారించడానికి తల్లిదండ్రులు తమ పిల్లల పేగు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని శిశువైద్యులు కోరుతున్నారు. పిల్లలలో సాధారణంగా కనిపించే పేగు సమస్యలు మలబద్ధకం, హైపర్ ఏసీడీటీ మరియు డైయేరియా . మలబద్ధకం 30% మంది పిల్లలను ప్రభావితం చేస్తుంది [1]. ఇది పిల్లలలో కడుపు నొప్పికి అత్యంత సాధారణ కారణం మరియు తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుంది. భారత దేశంలోని 22–25% మంది శిశువులను హైపర్ ఏసీడీటీ ప్రభావితం చేస్తుంది [2]. భారతదేశంలో ప్రతి సంవత్సరం 300,000 మంది ఐదేళ్లలోపు పిల్లలను అతిసారం చంపుతుంది. [3] సంపూర్ణ ఆరోగ్యాన్ని నిర్ధారించడంలో పేగులు ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ఓమేగాక్లినిక్స్, హైదరాబాద్, కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ కె పవన్ కుమార్ మాట్లాడుతూ "రోగనిరోధక, జీవక్రియ మరియు నరాల ప్రవర్తనా లక్షణాలతో సహా మానవ ఆరోగ్యంలో పేగులలో సూక్ష్మజీవులు కీలకమైనవి. అందువల్ల, మన మరియు మన పిల్లల పేగుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు, మన జీర్ణ రుగ్మతల కోసం మనం తీసుకునే మందుల గురించి జాగ్రత్తగా ఉండాలి. యాంటీబయాటిక్స్ యొక్క అనవసరమైన లేదా అధిక వినియోగానికి దూరంగా ఉండాలి ఎందుకంటే ఇవి జీర్ణాశయం లోని మంచి బ్యాక్టీరియాను చంపుతాయి మరియు వాటిని తిరిగి నింపడానికి 60 సంవత్సరాలు పడుతుంది. రోటా వైరస్ మరియు మీజిల్స్ వ్యాక్సిన్‌లతో సహా పిల్లలకు సరిగ్గా టీకాలు వేయడం కూడా చాలా ముఖ్యం. ఇది డయేరియాను నివారించడంలో బాగా సహాయపడుతుంది. జీర్ణ సంబంధ సమస్యల యొక్క ఏవైనా లక్షణాలను గమనించినప్పుడు లేదా టీకాకు సంబంధించిన సమాచారం కోసం, చిన్న పిల్లల డాక్టర్ ను సంప్రదించటం అవసరం. ట్రిలియన్ల బాక్టీరియా మన గట్ లోపల నివసిస్తుంది. బాక్టీరియా చెడు రకం మాత్రమే అని భావించే వారు , మరోసారి ఆలోచించండి! మన పేగులలో, మన ఆరోగ్యానికి, ముఖ్యంగా మన అభివృద్ధి చెందుతున్న పిల్లలకు చాలా ముఖ్యమైన పర్యావరణ వ్యవస్థను బ్యాక్టీరియా వృద్ధి చేస్తుంది. అసౌకర్య జీర్ణక్రియ, కడుపు నొప్పులు, పోషకాలను సరిగా గ్రహించకపోవడం, బలహీనమైన రోగనిరోధక శక్తి మరియు నిద్ర, మూడ్ హెచ్చుతగ్గులు మరియు అలసట వంటివి పేగు అనారోగ్యం యొక్క లక్షణాలు. పిల్లల ఆహారంలో ఎక్కువ ఫైబర్ ఉండేలా చూడటం తో సహా వారికి తల్లిపాలు ఇవ్వడం, కొవ్వు పదార్థాలను తగ్గించడం మరియు ప్రోబయోటిక్‌లను ఎంచుకోవడం వంటి అనేక మార్గాలు పిల్లల పేగు ఆరో గ్యాన్ని పెంచడానికి ఉన్నాయి. తగినంత నీరు తీసుకోవడం మరియు బయటికి వెళ్లి ఆడుకునేలా ప్రోత్సహించడం వంటివి వారి పేగు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తమ పిల్లల పేగు ఆరోగ్యంపై పెట్టుబడి పెడతామని ప్రతిజ్ఞ చేయడం అవసరం.

# అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణరెడ్డి

జయశంకర్ భూపాలపల్లి , మే27: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో రూ. 35లక్షలతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ శంకుస్థాపన, రూ. 25లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ పసునూరి దయాకర్



ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని రంగాలను అభివృద్ధి పరుస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ సమగ్ర అభివృద్ధిలో పయనిస్తుందని వెల్లడించారు. ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో మాట్లాడి చిట్యాల మండలం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద, జడ్పీటీసీ గొర్రె సాగర్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మెదక్, మే27: (నేటినిజం ప్రతినిధి):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పర్యావరణ అనుకూల జీవన విధానం (మిషన్ లైఫ్ – లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ ) పోస్టర్ ను ఆనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, కాలుష్య నియంత్రణ మండలి సహాయ పరావరణ శాస్త్రవేత్త రవీందర్ తో కలిసి ఆయుష్కారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఏడూ అంశాలతో ముడిపడి ఉన్నదని అన్నారు. నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడడం, ఘన వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఈ–వేస్ట్ మేనేజివెంట్ వద్దతులు ప్రపంచమంతా సక్రమంగా పాటిస్తే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. ఇది ఏ ఒక్కరితో సాధ్యం కాదని ప్రతి ఒక్కరు పాటించడం ద్వారా 2027 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 80 శాతం ప ర్యా వ ర ణా న్ని పరిరక్షించగలుగుతామని మాస్కోలోని గ్లాస్కో లో నవంబర్ 2021 న జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ చేంజ్ 26 వ కాన్ఫరెన్స్ భారత దేశం పిలుపునిచ్చిందని గుర్తుచేశారు. అనంతరం అధికారుల చేత పర్యావరణ అనుకూల జీవన విధాన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యకమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఒక్కసారిగా మారిన వాతావరణం.. ఉరుములు మెరుపులతో భారీ వర్షం

న్యూఢిల్లీ, మే27 దేశరాజధాని ఢిల్లీలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నిన్నటివరకు భానుడి భగభగలతో అల్లాడిపోయిన ఢిల్లీ కాస్త చల్లబడింది. శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోని పలు ప్రాంతాలతో పాటు హరియాణాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. గంటకు 40 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

భారీ వర్షం కారణంగా ఢిల్లీ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. కాగా, మే 30వ తేదీ వరకు ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

# పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ టీవీసీ విడుదల

హైదరాబాద్, మే27:మారికో లిమిటెడ్ ప్రీమియం హెయిర్ నరిష్మెంట్ బ్రాండ్ పారాచూట్ అడ్వాన్స్‌డ్ తన పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ హృదయాన్ని హత్తుకునే టీవీసీని విడుదల చేసింది. జుట్టు పెరుగుదలను పెంచడానికి, జుట్టు రాలడాన్ని తగ్గించడానికి కొబ్బరి, ఉల్లిపాయ అనే రెండు శక్తివంతమైన పదార్థాలు కలిసి ఎలా పని చేస్తాయో ఈ టీవీసీ హైలైట్ చేస్తుంది. ఈ చిత్రంలో కుమార్తె, ఆమె తల్లి మధ్య విడదీయరాని, ప్రత్యేకమైన బంధాన్ని చూపుతుంది. తల్లి తన కుమార్తెకు రాబోయే వివాహం, ఆమె జుట్టు భవిష్యత్తు కోసం మార్గనిర్దేశం చేస్తుంది. త్వరలో పెళ్లి కాబోతున్న కూతురు, ఆమె తల్లికి మధ్య జరిగే ప్రేమ సంభాషణతో, పెళ్లి తర్వాత బాధ్యతల్లో మార్పు సందర్భాలతో ఈ చిత్రం తెరకెక్కింది. స్నేహపూర్వకంగా, ఆమె చెల్లెలు కూడా తన అక్కను పరిహసిస్తూ, జుట్టు రాలడంతోపాటు కొత్త జీవితం తీసుకొచ్చే వివిధ మార్పులపై మాట్లాడుతుంది. తల్లి ప్రేమతో ఆమెకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్




ఉపయోగించడం వల్ల జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుందని చెబుతుంది. ఈ సందర్భంగా మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ మాట్లాడుతూ పారాచూట్ అడ్వాన్స్‌డ్ తరతరాలుగా మహిళలకు విశ్వాసపాత్రంగా ఉంటూ వస్తోందన్నారు. ఒక తల్లి–కూతురు సంబంధం నిజంగా ప్రత్యేకమైనదన్నారు. ఒక కూతురు తన తల్లిని ఆమె అత్యంత విశ్వసనీయ సలహాదారుగా చూస్తుందని తెలిపారు. తల్లి తన బిడ్డకు ఉత్తమమైన వాటిని మాత్రమే కోరుకోవడం అసమానమైనదన్నారు. మా తాజా చిత్రం సరిగ్గా అదే విషయాన్ని ప్రదర్శిస్తుందన్నారు. ఇక్కడ కూతురు పెళ్లికి ముందు తన తల్లి సలహాతో ఓదార్పు చెందుతుందని పేర్కొన్నారు. పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ అనేది రెండు శక్తివంతమైన పదార్థాల కలయిక అన్నారు. ఇది ఉల్లిపాయ శక్తిని, కొబ్బరి సద్గుణాలతో మిళితం చేస్తుందన్నారు. ఈ రెండూ కలిసి జుట్టు పెరుగుదలను పెంచడానికి జుట్టు రాలడాన్ని తగ్గించడానికి శక్తివంతంగా పనిచేస్తాయన్నారు. పారాచూట్ అడ్వాన్స్‌డ్ కింద మా తాజా ఆఫర్ మా వినియోగదారుల నమ్మకాన్ని పొందుతుందని, తరాలను అధిగమించే బ్రాండ్ అవుతుందని ఆశాభావంతో ఉన్నామని తెలిపారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ హన్స్ సక్సేనా మాట్లాడుతూ పారాచూట్ అడ్వాన్స్‌డ్ భారతదేశం అంతటా చాలా విశ్వసనీయమైన ఇష్టపడే బ్రాండ్ అన్నారు. పారాచూట్ అడ్వాన్స్‌డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ కోసం షూటింగ్ చేస్తున్నప్పుడు, కొబ్బరి ఉల్లి రెండు శక్తివంతమైన పదార్థాల ప్రయోజనాలను బయటకు తీసుకువచ్చేటప్పుడు వినియోగదారుని ప్రతిధ్వనించే భావోద్వేగాన్ని అర్థం చేసుకోవడం క్యాప్చర్ చేయడం చాలా ముఖ్యమని తెలిపారు.

# ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా పంటకాలాన్ని ముందుకు జరుపుకోవాలి : స్పీకర్ పోచారం




నిజామాబాద్, మే27: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ప్రకృతి వైపరీత్యాలకు గురైతే ఆ బాధ వర్ణించలేమని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆలోచన మేరకు రైతులు పంటకాలాన్ని ముందుకు జరుపుకుంటే అనేక రకాలుగా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో బాన్సువాడ నియోజకవర్గ స్థాయి రైతు అవగాహన సదస్సులో స్పీకర్ మాట్లాడారు.

పంటకాలాన్ని ముందుకు జరపడం వల్ల కలిగే లాభాలను వివరించారు. 'నవంబర్ నెలలో వచ్చే తుఫాన్లు, ఏప్రిల్ నెలలో కురిసే వడగండ్లు రైతులకు జీవన్మరణ సమస్యలను సృష్టిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను తప్పించలేం. కానీ పంట కాలాన్ని ముందుకు జరుపుకోవడం మన చేతిలో పని. తద్వారా పంటలను కాపాడుకోవచ్చని ' సూచించారు.

వానాకాలం పంటల సాగుకు మే నెల చివర్లో రోహిణి కార్తెలోనే నార్లు పోసుకోవాలని, నార్లు పోసిన నెల లోపు నాట్లు వేసుకోవాలన్నారు. 125 నుంచి 130 రోజుల్లో పంట చేతికి వస్తుందని దీని వల్ల అక్టోబర్, నవంబర్ నెలలో వచ్చే తుఫాన్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చాన్నారు. ' యాసంగి కోసం నవంబర్ రెండో వారంలో నార్లు పోసుకోవడం ద్వారా ఏప్రిల్ నెలలో సంభవించే అకాల వర్షాలు, వడగండ్ల నుంచి తప్పించుకోవచ్చు. ముందస్తు నాటుతో చీడపీడలు తగ్గుతాయి, దిగుబడులు పెరుగుతాయని' వెల్లడించారు.

రైతులు కోరితే నార్లు పోసుకోవడానికి నిజాంసాగర్ కాలువల క్రింద నీళ్లను అందిస్తామని, నిజాంసాగర్ లో కావలసినన్ని నీళ్లు ఉన్నాయి. అవసరమైతే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్ళు తెచ్చుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి నష్టం వస్తున్నా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో పంటల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతుకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో పంటల ఉత్పత్తులను కొనే దిక్కు లేదు. తెలంగాణ రాష్ట్రం మాత్రమే మద్దతు ధరతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని వివరించారు.

ఈ సదస్సులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి , నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ హనుమంతు, కామారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు డి అంజిరెడ్డి, ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడికి సన్మానం...



రాజన్న సిరిసిల్ల, మే27:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఐజేయు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన చందుర్తి మండల పాత్రికేయులు లాండే ప్రసాద్ ను కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ శనివారం సన్మానించారు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఐజెయు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు, ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, చందుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, సీనియర్ పాత్రికేయులు గడ్డం తిరుపతిరెడ్డి, పొంచెట్టి మహేష్, నక్క యాకూబ్, నాగరాజు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.